Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 10

గురువారం, జూలై 24, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## పాక్ విమానాలకు భారత్ గగనతలం నిషేధం పొడిగింపు

పాకిస్థాన్‌కు చెందిన విమానాలు తమ గగనతలాన్ని వినియోగించుకోకుండా విధించిన గడువును భారత్ మరోసారి పొడిగించింది. వచ్చే ఆగస్టు 24 వరకు పాక్ విమానాలు తమ గగనతలాన్ని వినియోగించుకోవడానికి వీల్లేదని నోటమ్ జారీ చేసింది. సెక్యూరిటీ ప్రోటోకాల్స్ కారణంగా గగనతల మూసివేతను పొడిగించామని కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ నిర్ణయం కారణంగా పాక్ విమానాలు , ఆ దేశ సైన్యానికి చెందిన ఫైటర్ జెట్లు, కార్గో విమానాలు, భారత గగనతలాన్ని వినియోగించుకోవడానికి వీలుండదు. పహల్గా ఉగ్రదాడి తరువాత తమ గగనతలాన్ని పాక్ విమానాలు వినియోగించుకోకుండా భారత్ మొదట ఏప్రిల్ 30 న నోటమ్ జారీ చేసింది. ఆ తర్వాత మే 24, జూన్ 24, జులై 24కు దాన్ని పొడిగిస్తూ వస్తోంది. భారత్ చర్యకు ప్రతీకారంగా పాకిస్థాన్ కూడా తమ గగనతలాన్ని మూసివేసింది. వచ్చే నెల 24 వరకు భారత్‌కు చెందిన విమానాలు తమ గగనతలం మీదుగా ప్రయాణించడానికి వీల్లేదని నోటమ్ జారీ చేసింది.

### బ్రిటన్, మాల్దీవుల పర్యటనకు ప్రధాని మోడీ



### వైద్య కళాశాలల్లో మరో 714 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ



### విద్యార్థుల హక్కుల కోసం బిఆర్ఎస్ పోరాడుతుంది ::: కెటిఆర్



# 42 % ఖచ్చితంగా సాధిస్తాం



- బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదించకుండా తాత్సారం
- మత ప్రాతిపదికన రిజర్వేషన్లు లేనేలేవు..
- వెనకబాటుతనం ప్రాతిపదకిన గుర్తింపు
- పార్లమెంటులో ఒత్తిడి తెచ్చేలా కాంగ్రెస్ పెద్దలకు నివేదిస్తా
- దత్తాత్రేయను ఉప రాష్ట్రపతి చేయాలి..
- తెలంగాణ నేతలకు బిజెపి అన్యాయం చేస్తోంది
- ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా విచారకరం..
- ఢిల్లీ మీడియా సమావేశంలో రేవంత్ డిమాండ్

ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్, ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయం ఉన్న మహారాష్ట్రలో ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. బీజేపీ నేతలకు దమ్ముంటే ఆ రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించాలి. గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్లు ఇకపై కూడా అమలు చేస్తామని ఒక ఇంటర్వ్యూలో చెప్పిన అమిత్ షాను బీజేపీ నుంచి సస్పెండ్ చేస్తారా?

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ,జూలై23 :తెలంగాణ ప్రభుత్వం పంపిన బిసి రిజర్వేషన్ల బిల్ ఆమోదించకుండా కేంద్రం ఆలస్యం చేస్తున్నదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్య ఉపాధి అంశాలతో పాటు, స్థానిక సంస్థల రిజర్వేషన్ల రెండు బిల్లులను ఆమోదించడం లేదన్నారు. బుధవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రం బిల్లును ఆమోదించకపోతే, ఒత్తిడి తెచ్చేందుకు మా వ్యూహం మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు లేవని.. మతాలు ప్రాతిపదిక కాదన్నారు. వెనుకబాటు తనమే తమ ప్రాతిపదిక అని స్పష్టం చేశారు. గురువారం ఉదయం మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలను కలుస్తామని తెలిపారు.. సర్వే వివరాలు వివరిస్తామని స్పష్టం చేశారు. తమ తరపున పార్లమెంట్ లో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరతమన్నారు. అలాగే సర్వే కోసం జరిగిన పక్రియ పై కాంగ్రెస్ ఎంపీలకు వివరిస్తామని వెల్లడించారు. జనగణనలో కులగణన చేర్చాలని.. జనగణనలో కులగణన ఎలా చేయొచ్చు.. దేశానికి తెలంగాణ మోడల్ గా నిలిచిందో వివరిస్తామన్నారు. తాము చేసిన సర్వే దేశానికి రోల్ మోడల్ అని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి తమ కార్యాచరణ సిద్ధం చేశామని వెల్లడించారు. కేంద్రం రిజర్వేషన్లను ఆమోదించాలని.. అందుకే కేంద్రం పై ఒత్తిడి తేవాలన్నారు. అవసరం అయితే కూటమి నేతలను కూడా కలుస్తామని చెప్పారు. సోషల్ జస్టిస్‌కు అందరూ సహకరించా లని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గుజరాత్, యూపీ,

(మిగతా 2వ పేజీలో)



# రాష్ట్రమంతా కుండపోత


## మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ సమీపంలో పొంగి పొర్లుతున్న మున్నేరు వాగు

- హైదరాబాద్ సహా పలు జిల్లాలు అతలాకుతలం.. కరీంనగర్ జలమయం..
- భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి
- నీట మునిగిన పర్ణశాలలోని సీతమ్మ నారచీరల ప్రాంతం, సీతమ్మ విగ్రహం
- ఉమ్మడి వరంగల్ జిల్లా ఏజెన్సీలో ఉప్పొంగిన వాగులు, వంకలు
- ఈతకు వెళ్లిన బాలుడు, చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు ..
- ఉత్తర తెలంగాణకు భారీ వర్షసూచన .. ఆరు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

# పట్టువీడని ప్రతిపక్షాలు

## పార్లమెంట్ ఉభయ సభల్లో కొనసాగిన ఆందోళనలు, నిరసనలు

- ప్లకార్డులు ప్రదర్శించే వారిపై చర్యలుంటాయని స్పీకర్ హెచ్చరిక
- వీధుల్లో చేయాల్సిన ప్రదర్శనలు సభలో చేస్తున్నారని మండిపాటు
- అయినా వెనక్కి తగ్గని ప్రతిపక్ష ఎంపీలు
- లోక్‌సభ, రాజ్యసభ గురువారానికి వాయిదా





# ఉచిత ప్రయాణంతో రూ.6వేల కోట్ల ఆదా

- మహాలక్ష్మి సంబురాల్లో డిప్యూటీ సిఎం భట్టి
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా లక్ష్యమని స్పష్టీకరణ
- మహిళలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తామని ప్రకటన
- మహాలక్ష్మితో ఆర్‌టిసి లాభాలబాట పట్టిందని వ్యాఖ్య
- ఎంజిబిఎస్‌లో ఘనంగా 200 కోట్ల మహిళల ఉచిత ప్రయాణాల వేడుక
- పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి

గోషామహల్: రాష్ట్రంలో కాంగ్రె స్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని, ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మ హిళలు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి, రూ. 6680 కోట్లు ఆదా చేసుకు న్నారని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 200 కోట్ల మహిళల ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఎంజీబీఎస్‌లో నిర్వహించిన కా ర్యక్రమంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి, రవా ణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో

(మిగతా 2వ పేజీలో)

# నక్షా లేని గ్రామాలకు తుదిరూపు

- ఐదు గ్రామాల్లో ప్రయోగాత్మక సర్వే
- 413 గ్రామాలకు నక్షాలు లేకన్న పట్టించుకోని బిఆర్ఎస్
- సర్వేపై అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష



హైదరాబాద్,జూలై23 : దశాబ్దాలుగా రాష్ట్రంలో నక్షా లేని 413 గ్రామాలకు గాను ఐదు గ్రామాలలో ప్రయోగాత్మకంగా చేపట్టిన రీసర్వేను విజయవంతంగా పూర్తిచేశామని వీలైనంత త్వరితగతిన ఆ ఐదు గ్రామాల్లో సర్వే బౌండరీస్ యాక్ట్ ప్రకారం నక్షా మ్యాప్ నకు తుదిరూపునిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో రీసర్వేపై ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి వి. లోకేష్ కుమార్, సర్వే ల్యాండ్‌సెటిల్ మెంట్ కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిజాం కాలం నుంచి 413 గ్రామాలకు నక్షాలు లేవని గత ప్రభుత్వం పది సంవత్సరాలలో ఈ గ్రామాలను గాలికి వదిలేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినేతృత్వంలోని

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ టుడే

గురువారం,
జూలై 24, 2025

# రాష్ట్రమంతా కుండపోత

రాష్ట్రాన్ని కుండపోత వాన ముంచెత్తింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో కురిసిన ఏకధాటి వానతో దారులన్నీ ఏరులయ్యాయి. వాగులు వంకలు పొంగిపొర్లాయి. బుధవారం ఉదయం నుంచి కుండపోత వానతో కరీంనగర్ తీవ్రంగా ప్రభావితమైంది. ఆకాశానికి చిల్లులు పడినట్టు ఉదయం 6 గంటల నుంచే వాన విరుచుకుపడటంతో నగర వీధులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ముఖ్యంగా కరీంనగర్ స్మార్ట్ సిటీ వరదతో అతలాకుతలమైంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కలెక్టరేట్, పోలీసు కమిషనరేట్ ప్రాంగణాలు, ప్రధాన జంక్షన్లు, రహదారులు నీటమునిగాయి. కరీంనగర్ పట్టణంలో 9.3, మానకొండూరులో 7.5 సెం.మీ, గంగిపెల్లి 7.5 సెం.మీ, చింతకుంట 6.3 సెం.మీ, జగిత్యాల జిల్లా ధర్మపురి (నేరెళ్ల) 9.1 సెం.మీ, బీర్పూర్ 5.4 సెం,మీ, ఎండపల్లి 7.3 సెం.మీ, గుళ్లకోట 7.3 సెం.మీ, చొప్పున వర్షం కురిసింది.



### ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జోరువాన

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలతో పలుచోట్ల వాగుల ప్రవాహం, లో లెవల్ చప్టాలపైకి నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భద్రాచలంలో గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతుండగా, దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో సీతమ్మ నారచీరల ప్రాంతం, సీతమ్మ విగ్రహం నీట మునిగాయి. కిన్నెరసాని, వైరా రిజర్వాయర్లలో సైతం నీటి మట్టం పెరిగి వైరా రిజర్వాయర్ అలుగు పోస్తోంది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు ప్రవాహం పెరగడంతో 15 గేట్లు ఎత్తి 33వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బూర్గంపాడు మండలం పినపాక పట్టీనగర్‌లోని సీతారామ కాలువ వద్ద నలుగురు బాలురు ఈతకు వెళ్లగా ప్రవాహంలో బొర్రా శివ(16) గల్లంతయ్యాడు. కారేపల్లి మండల వ్యవసాయ అధికారి గాదెపాడు రైల్వేఅండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వరదలో కారు చిక్కుకుపోయింది. దీంతో స్థానికులు గుర్తించి తాళ్ల సాయంతో గంటపాటు శ్రమించి బయటకు తీశారు. కుమురంభీం జిల్లావ్యాప్తంగా బుధవారం వర్షం దంచికొట్టింది. భారీ వరదతో చింతలమానెపల్లి, అహేరి మధ్య రవాణా నిలిచిపోయింది. ఆర్టీసీ బస్సులు రద్దు చేశారు. మంచిర్యాల జిల్లాలో ఎర్రవాగు ఉప్పొంగింది. కన్నెపల్లి మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన రైతు బోరుకుంట రాజం తన భార్య, మరో ఇద్దరు కూలీలతో కలిసి మంగళవారం తిమ్మాపూర్‌లోని పత్తి చేనుకు వెళ్లాడు. పని ముగించుకుని వస్తుండగా అప్పటికే కురిసిన భారీ వర్షానికి ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ట్రాక్టర్‌పై వాగు దాటుతుండగా ప్రవాహం పెరిగింది. ట్రాక్టర్‌పై ఉన్న వారంతా దూకి ప్రాణాలతో బయటపడ్డారు.

### ఏజెన్సీలో ఉప్పొంగిన వాగులు

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని జంపన్నవాగు ఉప్పొంగింది. కొండాయి వద్ద తాత్కాలికంగా పోసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. ఎస్ఎస్‌తాడ్వాయి మండలం పస్రా%-% తాడ్వాయి మధ్యలోని జలగలంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క బుధవారం పరిశీలించారు. మంగపేట మండల కేంద్రంలోని గిరిజన పెట్రోల్ బంక వద్ద ప్రధాన రోడ్డుపై నిర్మించిన కల్వర్టు సగం వరకు కోతకు గురై కొట్టుకు పోవడంతో ప్రమాదకరంగా మారింది. గార్ల సమీపంలోని పాకాల ఏరు బుధవారం చెక్‌డ్యాం పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండల కేంద్రమైన గార్ల నుండి రాంపురం, మద్దివంచ పంచాయతీలకు చెందిన 12 గ్రామాలు, తండాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధి అల్లిగూడెం గ్రామానికి చెందిన గర్భిణి గుమ్మడి కృష్ణవేణికి పురిటినొప్పులు రావడంతో నర్సాపూర్ వాగు వరదలో నుంచి వైద్య సిబ్బంది గ్రామస్తుల సహాయంలో బుధవారం వాగు దాటించారు. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు గ్రామానికి చెందిన తోటపల్లి వేణు(20) భద్రాచలంలో ఉంటున్న తమ్ముడికి బైక్ ఇవ్వడానికి వెళుతుండగా, మార్గమధ్యలో పెద్ద గొళ్లగూడెం వద్ద పిడుగు పడి చనిపోయాడు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలకేంద్రానికి చెందిన ఆగబోయిన నరేష్(30) రాళ్ల ఒర్రెవాగులో బుధవారం చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు.

### రానున్న రెండ్రోజులు వానలేవానలు

రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం వరకు ఏడు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. 20 సెంటీమీటర్లకు పైబడి వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు, కొన్ని చోట్ల అతిభారీ, ఒకట్రెండు ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు వివరించింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ మహబుబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు భారీ వర్షాలు కురుస్తాయని సూచిస్తూ... ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నైరుతి సీజన్‌లో ఇప్పటివరకు 29.78 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... బుధవారం నాటికి 26.79 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణం కంటే 10 శాతం లోటు వర్షపాతం ఉంది. నెలాఖరు కల్లా వర్షపాతం నమోదు గణాంకాలు మరింత మెరుగుపడతాయని అధికారులు చెబుతున్నారు. బుధవారం రాష్ట్రంలో సగటు వర్షపాతం 2.83 సెం.మీ.గా నమోదైంది.

# 42% ఖచ్చితంగా సాధిస్తాం



మహారాష్ట్రలో ముస్లింలకు రిజర్వేషన్లు ఉన్నాయి. అక్కడ ముస్లిం రిజర్వేషన్లు తొలగించి బీజేపీ నేతలు తెలంగాణ గురించి మాట్లాడాలి. బీజేపీ నేతలు వితండ వాదం చేస్తున్నారు. ఒక ఇంటర్వ్యూలో ముస్లిం రిజర్వేషన్లు అమలు చేస్తాం అని అమిత్ షా అన్నారు. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా..? కేంద్రం తక్షణమే బిల్లును ఆమోదించాలి. సర్వేను శాసన సభలో ప్రవేశ పెట్టి పూర్తి స్థాయిలో చర్చకు అవకాశం ఇచ్చాం. వ్యక్తుల వ్యక్తిగత వివరాలను బహిరంగ పరచలేదు. 3.9 శాతం ప్రజలు తమకు ఏ కులం లేదని డిక్లేర్ చేశారు. ఎక్స్పర్ట్స్ కమిటీ- ఇచ్చిన రిపోర్ట్ ను రోడ్ పై పెట్టలేం. ఫస్ట్ క్యాబినెట్ ముందు పెట్టాలి. శాసన సభలో ప్రశ్నిస్తే.. సమాధానం చెప్తాం. అడిగిన వివరాలు ఇస్తాం. పబ్లిక్ డొమైన్ లో పెట్టేటప్పుడు.. అన్ని న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తాం. క్యాబినెట్‌లో చర్చించి, శాసన సభలో ప్రవేశ పెడతాం. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు లేవు. మతాలు ప్రాతిపదిక కాదు. వెనుకబాటు తనమే మా ప్రాతిపదిక. బీజేపీ తొండి వాదన చేస్తోంది. తమ దగ్గర రీసెర్చ్ అండ్ అనాలసిస్ వివరాలు ఉన్నాయని సిఎం వివరించారు. బిజెపికి చిత్తశుద్ధి ఉంటే బండారు దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలని సిఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీఅయిన స్థానంలో బిసి అయిన దత్తాత్రేయకు ఛాన్స్ ఇవ్వాలని అన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓబీసీలకు న్యాయం చేయాలని భాజపాని కోరుతున్నానని అన్నారు. కేంద్ర పదవుల్లో తెలంగాణకు, బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. గతంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేతను తొలగించారు. ఇప్పటికే దత్తాత్రేయను గవర్నర్ పదవి నుంచి తొలగించారు. బీసీ అయిన దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎంతో పార్లమెంటరీ అనుభవం ఉన్న నేతగా దత్తాత్రేయకు పేరుందన్నారు. ఆయన సమర్థుడైన నేత అని, తెలంగాణకు చెందిన బిసి నేతగా ఆయనకు అవకాశం ఇవ్వాలని అన్నారు. ఇకపోతే కులగణన సర్వేలో వ్యక్తుల వ్యక్తిగత వివరాలను వెల్లడించలేదు. 3.99 శాతం మంది తమకు ఏ కులం లేదని చెప్పారు. స్వతంత్ర నిపుణుల కమిటీ- ఇచ్చిన నివేదిక ప్రకారమే మేం ముందుకెళ్తున్నాం. బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని కుట్ర చేస్తున్నవారే సందేహాలు లేవనెత్తుతున్నారు. కులగణన సర్వే డేటా కావాలంటే ఆయా పార్టీల ముందు, అసెంబ్లీలో ప్రవేశపెడతాం అని సిఎం అన్నారు. మేం కల్పించే రిజర్వేషన్లలో మతం ప్రస్తావనే లేదు. ముస్లింల పేరుతో మరోసారి భావోద్వేగ రాజకీయాలు చేయాలని భాజపా చూస్తోంది. మూడు రైతు వ్యతిరేక చట్టాల విషయంలో ఏం జరిగిందో అందరూ చూశారు. రైతు చట్టాల రద్దు స్ఫూర్తిగా బీసీ రిజర్వేషన్ల చట్టం ఆమోదం కోసం పోరాడుతాం అన్నారు. 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో 50శాతం నిబంధన దాటిపోయింది. దాని విషయంలో అడ్డురాని నిబంధన బీసీల విషయంలో ఎందుకు వస్తోందని సిఎం ప్రశ్నించారు. జగదీప్ ధన్కడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవి కోసం త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. అందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఈ అంశంపై తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు.జగదీప్ ధన్కడ్ రాజీనామా బాధాకరమన్నారు. ఉపరాష్ట్రపతి పదవి తెలంగాణకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న వెంకయ్య నాయుడును వెనక్కి పంపించారన్నారు. ఎన్డీయే తెలంగాణలో ఉన్న బీసీలకు అన్యాయం చేసిందని.. ఎన్డీఏ దత్తాత్రేయ, బండి సంజయ్‌ల గొంతు కోసిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉపరాష్ట్రపతి పదవి దత్తాత్రేయకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం నిలబెట్టాలన్నారు. 2029 లో పార్లమెంట్ ఎన్నికలకు ఓబీసీ ఇరిర్వేషన్లు లిట్మస్ టెస్ట్ అవుతాయి. ఓబీసీలకు న్యాయం చెయ్యడానికి బీజేపీ సర్కార్ సిద్ధంగా లేదు. ఏ బిల్లు పంపినా క్లారిఫికేషన్ అడుగుతారు.. రిజర్వేషన్ల బిల్ పై క్లారిటీ- అడిగారు. వాళ్ళు అడిగిన దానికి క్లారిటీ ఇచ్చామని సీఎం తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ వ్యవహరిస్తోన్న తీరుపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో బీజేపీ ద్వంద వైఖరి అవలబిస్తోందని.. అసెంబ్లీలో బిల్లుకు ఆమోదం తెలిపి.. పార్లమెంట్‌లో అడ్డుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లపై బిల్లులపై బీజేపీ తెలంగాణ చీఫ్ రామచందర్ రావు వితండవాదం చేస్తున్నారని విమర్శిస్తున్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మీరు ఇచ్చిన హామీని మీరే అమలు చేసుకోవాలని ఆయన అంటు-న్నారు.. కానీ కాంగ్రెస్ కు ఓ రాజ్యాంగం, బీజేపీకి ఓ రాజ్యాంగం ఉండదని చురకలంటించారు. బీజేపీ నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లలో ముస్లిం కోటా తొలగిస్తే బీసీ బిల్లులకు మద్దతిస్తామని కేంద్రమంత్రులు అంటున్నారు. మరీ మహారాష్ట్ర, ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఎప్పటి నుంచో బీసీ రిజర్వేషన్లలోనే ముస్లింలకు కోటా ఉందన్నారు. దమ్ముంటే అక్కడ తొలగించి.. తర్వాత తెలంగాణ గురించి మాట్లాడాలని సవాల్ విసిరారు. బీజేపీ వైఖరి ముస్లిం కోటాను అడ్డుకునే కుట్రగానే మేం భావిస్తున్నామన్నారు. బీసీ బిల్లులకు ఆమోదం తెలపకుండా సాకులు వెతుకుతున్నారని.. ముస్లిం కోటాను అడ్డంపెట్టి బీజేపీ నేతలను బీసీ బిల్లులను అడ్డుకుంటున్నారని విమర్శించారు. కేంద్రం బీసీ బిల్లులు ఆమోదించేలా విపక్షాన్నింటినీ ఏకం చేస్తామన్నారు.

# పట్టువీడని ప్రతిపక్షాలు

### పార్లమెంట్ ఉభయ సభల్లో కొనసాగిన ఆందోళనలు, నిరసనలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఉభయ సభల్లో వరుసగా మూడో రోజు బుధవారం సైతం విపక్షాల ఆందోళనలు, నిరసనలు, నినాదాలు కొనసాగాయి. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఢిల్లీలో మురికివాడల కూల్చివేత, బెంగాలీ వలస కార్మికుల పట్ల వివక్ష వంటి అంశాలపై వెంటనే చర్చ చేపట్టాలని ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. సభకు సహకరించాలని కేంద్రం పదేపదే విజ్ఞప్తి చేసినా వినిపించుకోకపోవడంతో లోక్‌సభ, రాజ్యసభ పలుమార్లు వాయిదా పడ్డాయి. ఉభయ సభల్లో ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు. బుధవారం ఉదయం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే విపక్ష ఎంపీలు బిగ్గరగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళనకు దిగారు. వెల్‌లోకి దూసుకొచ్చి ప్రశ్నోత్తరాలను అడ్డుకున్నాయి. వారిపై స్పీకర్ ఓం బిర్లా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. “సభలో ఎంపీలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రజల ఆకాంక్షలను వెల్లడించాలి. ఇలా నిరసనలతో సభా కార్యక్రమాలను అడ్డుకోవడం సరైంది కాదు. ఇది పార్లమెంటరీ విధానం కాదు. ఎంపీల ప్రవర్తనను దేశమొత్తం గమనిస్తోంది. సభా మర్యాదను కాపాడండి. వీధుల్లో చేయాల్సిన ప్రదర్శనలు సభలో చేస్తున్నారు. ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించే సభ్యులపై నిర్ణయాత్మక చర్య తీసుకోవాల్సి ఉంటుంది” అని హెచ్చరించారు. అయినా విపక్ష సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో సభ తొలుత మధ్యాహ్నం 12 గంటల వరకు, తర్వాత మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో సభను స్పీకర్ గురువారానికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ అదే పరిస్థితి పునరావృతమైంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సహా పలు కీలక అంశాలపై చర్చకు ఇచ్చిన వాయిదా తీర్మానాలను డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తిరస్కరించడంతో విపక్షాలు ఆందోళనకు దిగాయి. సభను సజావుగా కొనసాగించేందుకు సహకరించాలని కోరినా విపక్షాలు వినిపించుకోలేదు. దాంతో సభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. మళ్లీ ప్రారంభమయ్యాక ప్రశ్నోత్తరాలు చేపట్టినా విపక్షాల ఆందోళన, నిరసనలతో 2 గంటల వరకు, తర్వాత గురువారానికి వాయిదా పడింది. తమ డిమాండ్లపై పార్లమెంట్‌లో చర్చ చేపట్టాల్సిందేనని తేల్చిచెబుతూ విపక్ష ‘ఇండియా’ కూటమి ఎంపీలు పార్లమెంట్ మకరద్వారం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహా కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన(ఉద్ధవ్), జేఎంఎం, ఆర్‌జేడీ, వామపక్ష పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. ‘ప్రజాస్వామ్యాన్ని కాపాడండి‘, ‘ఓటు బందీని ఆపండి‘ అంటూ నినాదాలతో హోరెత్తించారు. చాలామంది ఎంపీలు నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ప్రతిపక్షాల డిమాండ్ మేరకు ‘ఆపరేషన్ సిందూర్’పై పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 28న లోక్‌సభలో, 29న రాజ్యసభలో చర్చ జరిగే అవకాశం ఉంది. దిగువ సభలో ఈ అంశంపై 16 గంటలపాటు చర్చ జరపడానికి ఈ నెల 21న జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. బుధవారం జరిగిన రాజ్యసభ బీఏసీ సమావేశంలోనూ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా వివరణ ఇవ్వాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. పాకిస్తాన్‌తో జరిగిన ఘర్షణలో భారత సైన్యం దాదాపు ఆరు యుద్ధ విమానాలు కోల్పోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో వాస్తవాలు బహిర్గతం చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో తొలుత లోక్‌సభలో సుదీర్ఘంగా చర్చ జరుగుతుందని, ఆ తర్వాత రాజ్యసభలో చర్చ ప్రారంభిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే, చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఇస్తారా? లేదా? అనేదానిపై స్పష్టత ఇవ్వలేదు.

# విద్యార్థుల హక్కుల కోసం బిఆర్ఎస్ పోరాడుతుంది ::: కెటిఆర్

విద్యార్థుల హక్కుల కోసం బిఆర్ఎస్ పోరాడుతుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ భరోసా ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు అద్భుతమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ నివాసంలో విద్యార్థి విభాగం నాయకులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ సంక్షోభానికి చేరిన పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై విద్యార్థులు పోరాటం చేస్తే, వారిపై అక్రమ కేసులు బనాయించడం దారుణమని అన్నారు. ప్రశ్నించే గొంతుకలను అణిచివేసేందుకు కాంగ్రెస్ చేస్తున్న పోలీస్ రాజకీయం చెల్లదని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను రాజకీయ ఆయుధంగా వాడుతున్నదని అన్నారు. విద్యావ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించిన రాష్ట్ర ప్రభుత్వం, దాన్ని ప్రశ్నిస్తున్న విద్యార్థులపై అడ్డగోలుగా కేసులు నమోదు చేస్తోందని ఆరోపించారు. సోషల్ మీడియాలో నల్లబాలుకు రీట్వీట్ చేసినా కేసు, మీడియా సంస్థల ముందు శాంతియుతంగా నిరసన తెలపడానికి వెళ్లినా అక్రమ కేసులు పెడుతున్నారని వాపోయారు.

# వైద్య కళాశాలల్లో మరో 714 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల అభివృద్ధి, బోధనా సిబ్బంది కొరతను అధిగమిం చేం దుకు మరో 714 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలి పింది. ఈ మేరకు ఆర్థిక శాఖ సంబంధిత ఫైల్‌ను క్లియర్ చేసింది. వైద్య కళాశాలల్లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇటీవల నేషనల్ మెడికల్ కమిషన్ ప్రశంసించిన సంగతి తెలిసిందే. ఒక్క సీటు కూడా కోత పెట్టకుండా, ఒక్క రూపాయి జరిమానా విధించ కుండా అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుమతులు కొనసాగిస్తున్నట్టు ప్రకటించి ంది. దీంతో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పండగ వాతావరణం నెలకొంది. కాగా మంత్రి రాజనర్సింహ ఆదేశాలతో వేగం పెంచిన అధికారులు తాజాగా అసో సియేట్ ప్రొఫెసర్ల కు, ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించింది. 33 స్పెషాలిటీ విభాగాల్లో 309 మందికి ప్రమోషన్లు కల్పిస్తూ వారికి పోస్టింగ్స్ ఇస్తూ జీవోలు కూడా విడుదల చేసిన సంగతి తెలిసిందే. వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్ల కొరత తీరుస్తూ త్వరలో అసిస్టె ంట్ ప్రొఫెసర్లకు, అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలి పింది. ఇటీవలే 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిన మెడికల్ అండ్ హెల్త్ సర్వీ సెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మరో 714 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆమోదం తెలుపడంతో వైద్య కళాశాలల్లో భోధన ప్రమాణాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు.

# ఉచిత ప్రయాణంతో రూ.6వేల కోట్ల ఆదా

మంత్రుల చేతుల మీదుగా పలువురు ప్రయాణీకులు, ఆర్టీసీ సిబ్బందిని ఘ నంగా సత్కరించారు. మహాలక్ష్మి పథకంతో టిజిఎస్ ఆర్టీసీకి రీయంబర్స్‌మెంట్‌కు రూ.6, 680 కోట్లకు సం బంధించిన చెక్కును డిప్యూటీ సిఎం ఆర్టీసీ ఎండీ విసి సజ్జనార్‌కు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో సంబరాలు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని మహిళలు పిల్ల చదువుల కోసం, దేవాలయాల సందర్శన, నగరా ల్లో ఉద్యోగం వంటి పనుల కోసం ఆర్టీసీ సేవలను మహాలక్ష్మి పథకం ద్వారా ఉపయోగించుకుని, ఆర్థికంగా ప్రయోజనం పొందారని డిప్యూటీ సిఎం పేర్కొన్నారు. ఆర్టీసీ మునిగిపోయే పడవ అని, ఆ రోజు అన్నారని, ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తర్వాత ఆర్టీసీ లాభాల్లోకి వచ్చి నిలదొక్కుకుం టుందని డిప్యూటీ సిఎం వివరించారు. 200 కోట్ల ప్రయాణాలకు అయిన ఖర్చు రూ.6,680 కోట్ల ఆడబిడ్డల పక్షాన ఆర్టీసీకి రా ష్ట్ర ప్రభుత్వమే ఎప్పటికప్పుడు చెల్లిస్తుందన్నారు. భవిష్యత్‌లోనూ ఆడబిడ్డల ఆర్టీసీ ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఆర్టీసీలో రవా ణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కొత్త విధానాలు తీసుకు వస్తుండటంతో ఆర్టీసీ ఆదాయం పెరిగిందని, ఇప్పటి వరకు ప్రభుత్వం ఏర్ప డిన తర్వాత ఆర్టీసీ 2400 కొత్త బస్సులు కొనుగోలు చేసిందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గతంలో ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో 60 శాతం కాగా మహాలక్ష్మి పథకం ద్వారా ఆక్యుపెన్సీ రేషియా 97 శాతానికి పెరిగిందన్నారు. మహాలక్ష్మిపథకానికి ముందు ఆర్టీసీలో 45 లక్షల మంది ప్రయాణిస్తే, ఇప్పుడు ఆ సంఖ్య 65 లక్షలకు చేరిందని తెలిపారు. రాష్ట్ర రాజధానిని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు డీజిల్ బస్సులను నగరం బయటకు దశల వారీగా తరలిస్తుండటంతో పాటు నగరంలో గల 11 శాతం బ్యాటరీ బస్సులను జత చేయడం జరిగిం దని, ఇప్పటికే 3వేల బ్యాటరీ బస్సులకు ఆర్డర్ ఇచ్చినట్లు డిప్యూటీ సిఎం వివరించారు.

# బ్రిటన్, మాల్దీవుల పర్యటనకు ప్రధాని మోడీ

ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం నాలుగు రోజుల విదేశీ పర్యటనకు బయలుదేరారు. ఆయన బ్రిటన్, మాల్దీవులలో పర్యటిస్తారు. ఈ దశలో ప్రధాని ప్రకటన వెలువరించారు. బ్రిటన్ పర్యటన కీలకం అని, వ్యాపార, వాణిజ్య ఇతర రంగాలలో ఇరుదేశాలు ఉమ్మడి , సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం సంబంధాలు ఇటీవలి కాలంలో గణనీయ పురోగతి దశలో ఉన్నాయని విమానంలో వెళ్లే ముందు ప్రధాని స్పందించారు. తాము ప్రధాని కీర్ స్టార్మర్ ఇతార నేతలతో విస్తృత చర్చలు జరుపుతామని పేర్కొన్నారు. కింగ్ ఛార్లెస్‌ను కూడా ప్రధాని మోడీ కలుసుకుంటారు. ఆ తరువాత ఆయన మాల్దీవులుకు వెళ్లుతారు. మాలేలో ప్రెసిడెంట్ మెహమ్మద్ ముయిజుతో చర్చలు జరుపుతారు. ఇరుదేశాల బెడిసికొట్టిన సంబంధాల , పెరిగిన అగాథాల తొలిగింపు క్రమంలో భారత ప ప్రధాని మోడీ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. అంతేకాకుండా మాల్దీవుల స్వాతంత్ర్య 60వ వార్షికోత్సవాలలో కూడా ఆయన పాల్గొంటారని అధికార వర్గాలు బుధవారం తెలిపాయి.

# నక్షా లేని గ్రామాలకు తుదిరూపు

ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ప్రయోగాత్మకంగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి , ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాల్లో డ్రోన్ /ఏరియల్ మరియు ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ రోవర్ పద్దతుల్లో సర్వే నిర్వహించామని తెలిపారు. నిబంధనల ప్రకారం భూ యజమానులకు నోటీ సుల జారీ చేయడం, గ్రామ సభలు నిర్వహించి యజమానుల అభ్యంతరాలను పరిగ ణనలోకి తీసుకొని ప్రతి ఒక్కరి భూములకు సర్వే హద్దులను ఖరారు చేయాలని నిర్ణయి ంచినట్లు వెల్లడించారు. ఈ ఐదు గ్రామాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలోపెట్టు-కొని మిగిలిన గ్రామాల్లో కూడా రీసర్వే నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు- చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల మనోభావాలు, ఆలోచనలకు అనుగుణంగా వారు సంతృప్తి చెందేవిధంగా నక్షా మ్యాప్ ఉండాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఏం చేసినా అంతిమంగా సామాన్య ప్రజలు, రైతుల సంతోషమే ప్రధానమన్నారు. భూ ములు అమ్మకం, కొనుగోలు సందర్భంలో హద్దులతో కూడిన సర్వే మ్యాప్ ను ఖచ్చి తంగా జత పరచాలని అలాగే దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ నెంబర్ ఎలా ఉంటుం దో భూములకు కూడా భూదార్ నెంబర్ కేటాయించాలని భూభారతి చట్టంలో స్పష్టం చేయడం జరిగిందని ఈ ఐదు గ్రామాలలో ఈ రెండు అంశాలను అమలు చేయాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. ఈ ఐదు గ్రామాలలో ఐదు గుంటలకు పైగా ఉన్నభూము లకు కొత్తగా సర్వేనెంబర్లు ఇవ్వాలని, అలాగే రెవెన్యూ, ఫారెస్ట్, దేవాదాయ, వక్ఫ్ భూ ములు ఉంటే వాటి వివరాలను కూడా రికార్డులలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ జాయి ంట్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి, ఐదు గ్రామాలకు చెందిన ఆర్డీవోలు, తహశీల్దార్లు, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్లు, పాల్గొన్నారు.

# జర్నలిజంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి...



## తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, జూలై 23(వాయిస్ టుడే): బుధవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో రంగారెడ్డి జిల్లా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు నిర్వహిస్తున్న రెండు రోజులపాటు శిక్షణ తరగతుల కార్యక్రమానికి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా రంగం సాంకేతికతతో వేగంగా వార్తల సేకరణ సులభం అవుతుంది తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ సంపాదకులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు - మీడియా ధోరణులు, ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా యూట్యూబ్ లో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజల్లో వెళు న్నాయని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఫేక్ న్యూస్, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా, ఫ్యాక్ట్ చెక్, మొదలగునవి టెక్నికల్ గా ఏలా ఉపయోగించాలో జర్నలిస్టులకు సవివరంగా తెలియజేశారు.

సీనియర్ జర్నలిస్ట్ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ, నేర వార్తల సేకరణ లో తీసుకోవలసిన జాగ్రత్తలు, చట్టాలపై అవగాహన ఉండాలని, వార్తలు సేకరించే ముందు నిజనిర్ధారణ చేసుకొని చేసుకుని వ్రాయాలని ఆయన సూచించారు, అలాగే నేర వార్తలు లలో చేయాల్సినవి చేయకూడనివి అంశాలపై క్లుప్తంగా వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డి మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం- 2005 గురించి సమగ్రంగా వివరించి జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర రావు,ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి,టీయూడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు సలీమ్ పాషా,కార్యదర్శి మేకల సత్యనారాయణ, రంగారెడ్డి జిల్లా డిపిఆర్ఓ పి.సి. వెంకటేశం, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సులో పాల్గొన్న గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్

జిన్నారం జులై 23 (వాయిస్ టుడే) : గుమ్మడిదల పురపాలక సంఘ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సులో పాల్గొన్న మున్సిపల్ కమీషనర్ దశరతం డాక్టర్ మధుకర్ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది , పురపాలక పురపాలక సిబ్బంది మరియు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు, ఇందులో కాలానుగుణంగా వ్యాధుల నియంత్రపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయం కల్పించాలనీ సమావేశం నిర్వహించడం జరిగింది, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియచేయాలని సూచించారు, హ్యాండ్ వాష్, డ్రై డే యాక్టివిటీ పాటించాలని సూచించారు మరియు ఆగస్టు 10 వ తేదీ నుండి ఎం డి ఏ కార్యక్రమం లో ఆల్బెండజోల్, డి ఈ సి మాత్రలు, ఐ వెర్మిసిటిన్ మాత్రలు ప్రతి ఒక్కరికీ ఇవ్వడం జరుగుతుంది ఫైలేరియా నిర్మూలన లో ప్రతి ఒక్కరూ పాల్గొని ఫైలేరియా ను నిర్మూలన లో భాగం కావలని తెలిచేయడం జరిగింది.



## మృతుల కుటుంబాలను పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

జిన్నారం జులై 23 (వాయిస్ టుడే): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ గ్రామానికి చెందిన కంజర్ల సుదర్శన్, రోడ్డు ప్రమాదంలో, నీరుడి శ్రీనివాస్ అనారోగ్యంతో మరణించారు. ఈ విషాదకర సమయంలో వారి కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సి.జి.ఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ దుఃఖాన్ని తట్టుకోగలిగే ధైర్యాన్ని దేవుడు ఇవ్వాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు గోవర్ధన్ రెడ్డిని కలిసి వారి సమస్యలు వినిపించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేందుకు ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్శనలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు ప్రకాష్, దయానంద్, లక్ష్మణ్, రాజు, వీరయ్య, వీరేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు రేపు జరగబోయే కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొనాలి



జిన్నారం జులై 23 (వాయిస్ టుడే ): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు తెలియజేయునది ఏమనగా తేదీ రేపు గురువారం ఉదయం 8 గంటలకు రాష్ట్ర మాజీ మంత్రివర్యులు గౌరవనీయులు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదినం సందర్భంగా గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామంలో కేక్ కటింగ్ చేయడం జరుగుతుంది ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మాదారం మాజీ సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్ కార్యాలయంవద్దకు ఉదయం 8 గంటల వరకు చేరుకోవాల్సిందిగా పిలుపునిచ్చిన జిన్నారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాజేష్

## గుమ్మడిదల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీకాంత్ రెడ్డి



జిన్నారం జులై 23 (వాయిస్ టుడే): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని గుమ్మడిదల స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించిన పెరుమాళ్ళు లక్ష్మీకాంత్ రెడ్డి ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలోని అందరి సహాయ సహకారాలతో శాంతిభద్ర పరిరక్షణకు పూర్తిస్థాయిలో పనిచేస్తానని శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల చట్ట పరంగా కఠినంగా వ్యవహరిస్తానని ఆయన పేర్కొన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి 41 రోజుల ఉండి ఆదాయం

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆదాయం (రెండు కోట్ల నలభై ఐదు లక్షల నలభై ఎనిమిది వేల ఇరవై మూడు రూపాయలు మాత్రమే) మిశ్రమ బంగారం 38 గ్రాములు మాత్రమే మిశ్రమ వెండి (రెండు కిలోల 800 గ్రాములు మాత్రమే) అమెరికా 1036 డాలర్లు ఆస్ట్రేలియా 5 డాలర్లు ఇంగ్లాండ్ 45 పౌండ్స్ సౌదీ అరేబి య5 రియల్ సింగపూర్ 10 డాలర్స్ కతర్ 1/2 రియల్ ఒమన్ 500 బైస అరబ్ ఏమి రెట్స్ 70 ధీరమ్స్ శ్రీలంక 500 మలేషియా 23 రింగ్ ట్స్ కెనడా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఉండి లెక్కింపులో ఈవో వెంకట్రావు దేవస్థానం స్టాప్ పోలీస్ సిబ్బంది సెక్యూరిటీ సిబ్బంది. భక్తులు అధిక సంఖ్యలో ఉండి లెక్కింపులో పాల్గొన్నారు.





## ఎచ్ఎఎల్ కాలనీలో నూతన బస్ స్టాప్ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ జులై23(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని 125 గాజులరామారం డివిజన్ ఎచ్ఎఎల్ కాలనీలో కీ"శే దుందుముల్ల రాధమ్మ, కీ"శే లక్ష్మి నారాయణ రెడ్డి, దుందుముల్ల వెంకట రంగా రెడ్డి గార్ల జ్ఞాపకర్ధంగా దుందుముల్ల ఇంద్రసేనారెడ్డి గారు నిర్మించిన నూతన బస్ స్టాప్ ను మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిధిగా హాజరై తన చేతుల మీదిగా నూతన బస్ స్టాప్ ను ప్రారంభించారు.అనంతరం ఎచ్ఎఎల్ కాలనీవాసులకు, వృద్దులకు, విద్యార్థులకు అందరికి అందుబాటులో ఈ నూతన బస్ స్టాప్ నిర్మించిన ఇంద్రసేనా రెడ్డి శాలువాతో సత్కారించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డి, కెకెఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్, చిత్తరమ్మ ఆలయ చైర్మన్ కూన అంత్తయ్య గౌడ్, ఆర్.బాలరాజు, పి. మహేందర్ రెడ్డి, ఇంద్రసేన గుప్తా, డి.లక్ష్మీనారాయణ రెడ్డి, డి. ఎల్లారెడ్డి, డి. సంజీవ రెడ్డి,ఎం. సంజీవ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి,వెంకట్ రెడ్డి, శ్రీరాములు,యాదగిరి, వేణుగోపాల్ రెడ్డి,వర్మ, యాంసాగర్, గౌరిశెట్టి శివ, హఫీజ్ అలీ, ఆరిఫ్, నబి, డాన్ శీను, రమేష్, ఏశ్వంత్ రెడ్డి పాటు కాలానీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## కార్మికునికి నష్టపరిహారం ఇప్పించిన బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

కుత్బుల్లాపూర్ జులై 23(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ గాంధీనగర్ ఇండస్ట్రీ ఏరియాలో "ప్రేరనీ ఇండస్ట్రీస్" లో రంజన్ కుమార్ అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాల నుంచి కంపెనీ లో పనిచేసేవారు, రోజులాగే కంపెనీ లో పనిచేస్తుండగా రంజన్ కుమార్ కు ఎడమ చేతి బొటనవేలు కాట్ వడం జరిగింది... వెంటనే అక్కడున్న తోటి కార్మికులు అలాగే కంపెనీ యొక్క యజమాన్యం హాస్పిటల్ కి తీసుకెళ్లి ట్రీట్మెంట్ చేయించి , రంజన్ కుమార్ అనే కార్మికుడిని ఇంటికి పంపించారు... ఆ తర్వాత పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని తగిన న్యాయం చేయాలని ఎన్నిసార్లు అడిగినా రంజన్ కుమార్ పట్ల నిర్లక్ష్యం వహిస్తూ తనను ఏదో రకంగా కంపెనీ యజమాన్యం ఇబ్బంది పెడుతూ పంపించేవారు, అడిగి అడిగి విసుగు చెందిన కార్మికుడు రంజన్ కుమార్ కు ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే కార్మికులకు న్యాయం చేస్తారని తోటి కార్మిక మిత్రుల ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు.. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన " ప్రేరణి ఇండస్ట్రీస్" కంపెనీ వద్దకు బయలుదేరి యజమాన్యంతో పలుమార్లు చర్చించి కార్మికుడికి రంజన్ కుమార్ కు నష్టపరిహారం (ఒక లక్ష నలభై వేల) రూపాయలు ఇప్పించడం జరిగింది... కార్మికుడు రంజన్ కుమార్ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



## ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి

కుత్బుల్లాపూర్ జులై 23(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి లోని ఎన్.టి.ఆర్ నగర్,రాజీవ్ గాంధీ నగర్(సూరారం),చంద్రగిరి నగర్ (గాజులరామారం), అంబేద్కర్ నగర్,అయోధ్య నగర్,జైరాం నగర్,హరిజన బస్తీ(కుత్బుల్లాపూర్ గ్రామం) లలో బోనాల పండుగ సందర్భంగా నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం లో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి.

## వంద రోజుల ప్రణాళిక లో భాగంగా పారిశుద్ధ పనులను పర్యవేక్షించిన మున్సిపల్ అధికారులు



జిన్నారం జులై 23 (వాయిస్ టుడే ): సంగారెడ్డి జిల్లా బొల్లారం పురపాలక సంఘములో బుధవారం రోజున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 52వ రోజు 100 రోజుల కార్యక్రమానికి బొల్లారం మున్సిపల్ ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ మరియు మున్సిపాల్ కమిషనర్ కిషన్ మున్సిపాలిటీ పరిధి లోని వివిధ వార్డులల్లో భువన్ సర్వే, శిథిలవస్థ లో ఉన్న భవనాలను మరియు దారి పొడవునా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించుట వివిధ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించటం జరిగింది మరియు 100 రోజుల కార్యక్రమం లో భాగంగా వివిధ వార్డుల్లో జరుగుతున్న పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో 100 రోజుల కార్యక్రమానికి ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ మరియు మున్సిపల్ కమిషనర్ కిషన్ తో పాటు రెవెన్యూ మేనేజర్ వార్డ్ ఆఫీసర్స్ మరియు మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు పాల్గొనడం జరిగినది.



## స్థానిక ఎన్నికల దృశ్య భాజపా ఆధ్వర్యంలో మండలస్థాయి వర్క్ షాప్ కార్యక్రమం

జిన్నారం జులై 23 (వాయిస్ టుడే ): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో స్థానిక ఎన్నికల గురించి తెలంగాణ రాష్ట్ర భాజపా అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా రథసారథి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి సూచన మేరకు గుమ్మడిదల మండల అధ్యక్షులు కావలి ఐలేష్ ఆధ్వర్యంలో బుధవారం నాడు స్థానిక ఎలక్షన్స్ దృశ్య మండల స్థాయి వర్క్ షాప్ సమావేశం నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీమతి మీనా గౌడ్ ప్రభారిగా హాజరై ఈ యొక్క సమావేశం ముఖ్య ఉద్దేశాలను వివరిస్తూ దిశనిర్దేశం చేస్తూ మండల స్థాయి పదాధికారులకు,శక్తి కేంద్రాల ఇన్చార్యులకు భూత్ అధ్యక్షులకు,బూత్ కమిటీ సభ్యులకు వివరించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎలక్షన్లో భాజపా పార్టీ నుండి ప్రతి ఒక్క నాయకుడు ఎలక్షన్ లో నిలబడి పెద్ద ఎత్తున బిజెపి పార్టీకి స్థానాలు తీసుక రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు సారా సుజలక్ష్మి, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోముల్ల యాదగిరి, ఉపాధ్యక్షులు మొల్లగూడం సాయికుమార్, మండల కమిటీ సెక్రెటరీ ఆర్గనైజర్ సర్ రెడ్డి గారి వీరారెడ్డి, మండల కోశాధికారి రాజశేఖర్, పదాఅధికారుల మహిళ సెక్రెటరీ సుంకరి కవిత,అనిత, భూత్ అధ్యక్షులు కానుకుంట ముత్యాల గౌడ్, వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కుమ్మరి భాగయ్య,మహిళా కార్యకర్తలు తదిర్లు భారీగా పాల్గొన్నారు.

వాయిస్ టుడే

హైదరాబాద్
గురువారం, 24 జూలై 2025



## జై జవాన్ కాలనీ షట్టర్లను పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- డివిజన్ పరిధిలోని జై జవాన్ కాలనీ లో గల షటర్ల నీ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. జిహెచ్ఎంసి వారు ఖాళీ చేయాలని నోటీసులు రావడంతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వారి అభ్యర్థన మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించారు.జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ గారితో మాట్లాడి కొన్ని రోజుల పాటు యదావిధిగా షటర్లు నడిపేలా చూడాలని కోరడం జరిగింది. సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జై జవాన్ కాలనీ అధ్యక్షుడు తీరుమలయ్య బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు మహిపాల్ రెడ్డి కుమార స్వామి కాలని వాసులు తదితరులు పాల్గొన్నారు.



## దివంగత మాగంటి గోపీనాథ్ సంతాప సభ మాగంటి వజ్రనాథ్

జూబ్లీహిల్స్ 23 జులై (వాయిస్ టుడే ): సోమాజిగూడ డివిజన్ శ్రీనగర్ కాలనీ నాగార్జున కమిటీ హాల్లో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంతాప సభ నిర్వహించిన మాగంటి గోపీనాథ్ సోదరుడు మాగంటి వజ్రనాథ్ మరియు తల్లి మహానంద కుమారి.... ప్రజలు మాట్లాడుతూ మాగంటి గోపినాథజ్ గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.నేడు ఆయన లేని లోటు నియోజకవర్గంలో స్పష్టంగా కనిపిస్తోందని శ్రీనగర్ కాలనీ వాసులు తెలిపారు..దివంగత మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.. భారీ ఎత్తున వచ్చిన ప్రజలకి కానుకలు అందించారు..



## ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాగంటి వజ్రనాథ్

జూబ్లీహిల్స్ జులై 23(వాయిస్ టుడే): జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధి లోని యూసుఫ్ గూడా ఎల్ఎన్ నగర్లో బోనాల పండుగ సందర్భంగా నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం లో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాగంటి వజ్రనాథ్..

## టెన్త్ క్లాస్ విద్యార్థి అదృశ్యం



నాచారం జూలై 23(వాయిస్ టుడే): టెన్త్ క్లాస్ చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమైన సంఘటన కూషాయిగూడ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మీర్పేట్ మౌలాలీ వెంకటేశ్వరనగర్ కాలనీకి తాత, నాయనమ్మ వద్ద ఉంటూ బి. రిష్యేంద్ర(15) భాష్యం హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. గత వారం రోజులుగా అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. బుధవారం మధ్యహ్నం నుంచి కనిపించకుండా పోయాడు. సాయంత్రం వరకు తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంభ సభ్యులు కూషాయిగూడ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇతనీ ఆచూకి తెలిసిన వారు ఫోన్ నెంబర్ 9347123061 లో సమాచారం ఇవ్వాలనీ విజ్ఞప్తి.

## వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

### - సిపిఐ కార్యదర్శి సయ్యద్ గౌస్ అలీ



నాచారం జూలై 23 (వాయిస్ టుడే): వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని డివిజన్ సిపిఐ కార్యదర్శి సయ్యద్ గౌస్ అలీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల్లోని విద్యుత్తు స్తంభాలకు రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరారు. కరెంటు ఫోన్లో నుంచి విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున ఐరన్ స్తంభాలు ఉన్న స్థానంలో వాటి తొలగించి నూతనంగా సిమెంటుతో తయారుచేసిన స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు . ప్రజలు సైతం వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలకు దూరంగా వెళ్లాలని సూచిస్తున్నారు. ప్రధానంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో కరెంటు స్తంభాల నుంచి ఎర్తింగ్ వచ్చే అవకాశం ఉన్నందున , దానితో ప్రమాదాలు సంభవించవచ్చు కావున విద్యార్థులు ఆ విషయాన్ని గమనిస్తూ దూరంగా వెళ్లాలన్నారు.

# చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

### ఢిల్లీ జాతీయ ఓబీసీ సెమినార్‌లో పలువురు అఖిలపక్ష ఎంపీలు డిమాండ్

హైదరాబాద్: జూలై 23బీ( వాయిస్ టూ డే): ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్లో ఆంధ్రప్రదేశ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోను దుర్గా నరేష్ యాదవ్ అధ్యక్షతన జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ అధికార ప్రతినిధి ఢిల్లీ ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు.

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రాజ్యసభ సభ్యులు ఏం.పి.ఆర్. కృష్ణయ్య కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి,తెలుగుదేశం రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, బిజెపి ఎం.పీ.పాకాల సత్యనారాయణ మాజీ ఎంపీ వి. హనుమంతరావు, బిపి మండల్ మనవడు సూరజ్ మండల్, విసి కరుణానిధి సెమినార్ లో పాల్గొన్నారు.

ఈ జాతీయ ఓబీసీ సెమినార్ లో 36 బీసీ సంఘాలు 28 బిసి కుల సంఘాలు 32 ఉద్యోగ సంఘాన్ని 32 ఉద్యోగ సంఘాలు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ కర్ణాటక తమిళనాడు యూపీ ఢిల్లీ నుండి పలువురు ప్రతినిధులు హాజరయ్యారు.



తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి తంగేళ్లమూడి నందగోపాల్, మహిళా నాయకురాలు బోన్ శారద, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు జగదీశ్వరరావు, బీసీ నాయకుడు మురళి, కృష్ణమాచారి, శ్రీనివాస్, వెంకటరమణ, రేణు, శరత్ ప్రకాష్ మరియు 3 రాష్ట్రాలకు సంబంధించిన ముఖ్యమైన బీసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు బీసీ క్రిమిలేయర్ పై వాడి వేడిగా చర్చలు జరిగాయి. ఇప్పుడున్నటువంటి బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి బీసీ డిమాండ్లు సాధించుకోవాలని ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ బీసీ సెమినార్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్ పాల్గొన్నారు.



## ఉప్పల్‌లో బోనాలకు భారీగా ఏర్పాట్లు.. ఆలయాల వద్ద సౌకర్యాలకు రూ.30 లక్షల నిధుల మంజూరు

### - ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఉప్పల్‌లో బోనాలకు భారీగా ఏర్పాట్లను చేయనున్నట్లుగా కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మహంకాళి, పోచమ్మ ఆలయాలతో పాటు ఇతర ఆలయాల వద్ద కూడా అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామన్నారు. బోనాలను పురస్కరించుకొని డివిజన్ కు రూ.30 లక్షల నిధులను మంజూరు చేయించినట్లుగా చెప్పారు.ప్రతి ఆలయం వద్ద లైట్లు, పారిశుద్ధ్యం, మంచినీరు, ఇతర అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామన్నారు. బుధవారం పలు విభాగాల అధికారులతో కలిసి రజిత పరమేశ్వర్ రెడ్డి డివిజన్ లోని పలు ఆలయాలను సందర్శించి కల్పించాల్సిన సౌకర్యాలను గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈఈ హరిలాల్, డిఈ వెనీల్ గౌడ్,డిఈ చందన,ఏఈ రాజ్ కుమార్,ఎంటమాలజీ ఏఈ నరేష్ రెడ్డి, జిహెచ్ఎంసి ఎలక్ట్రికల్ డిఈ రవీందర్,ఆలయ కమిటీ సభ్యులు, బిక్కుమాల అంజయ్య,గుప్తా, ఈగ ఆంజనేయులు ముదిరాజ్, మహంకాళి దేవాలయ చైర్మన్, తేల్కల మోహన్ రెడ్డి, గౌరిగే ఐలయ్య, గుజ్జు భాస్కర్, ఎర్ర నరసింహ, లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్ రెడ్డి, సుంకు శేఖర్ రెడ్డి,మంద మురళీకృష్ణ రెడ్డి,శాగా శేఖర్, శ్రీకాంత్ గౌడ్, గుమ్మడిల్లి కృష్ణ, మీనంపల్లి అందలు,మాశెట్టి రాఘవేంద్ర, అలుగుల అనిల్ కుమార్, మహంకాళి రాజు ముదిరాజ్,పూజారి హనుమంతు, అల్వాల్ భాస్కర్, వెంకటేష్ సెట్, మేనంపల్లి శ్రీశైలం, మేనంపల్లి సురేష్, బింగి దశరథ గౌడ్, మహంకాళి సాయిలు,కుశంగల సతీష్ ముదిరాజ్, సత్యనారాయణ, విజయ్ కుమార్, సతీష్ గౌడ్, నవీన్ గౌడ్, రంగుల శేఖర్,కావాలి రాము, స్వీట్ హౌస్ రాజు, గిరి ముదిరాజ్, కుమ్మరి సాయి, మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో పెట్రోలు పోసి ఇల్లుకు నిప్పు పెట్టిన వారిపై చట్టారిత్యా చర్యలు తీసుకోవాలి

### కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇంచార్జ్ మందముల్ల పరమేశ్వర్ రెడ్డి

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పరమేశ్వర్ రెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- రామంతాపూర్ లోని ఇందిరానగర్ కు చెందిన శ్రీనివాస్ ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. దీంతో ఇంట్లో ఉన్న రెండు ద్విచక్రవాహనాలు కాలి పోయాయి. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన పరమేశ్వర్ రెడ్డి విషయం తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే గుర్తించి నింధితులను అరెస్టు చేయాలన్నారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ ఘటన జరిగినప్పుడు ఎవ్వరు ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పిందని శ్రీనివాస్ కుటుంబ సభ్యులు వాపోయారు. ఈ కార్యక్రమం లో ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్,వాళ్ళపు శ్రీకాంత్ యాదవ్,బుల్లెట్ అశోక్,కశ్మల్లా శంకర్,ఉపేందర్ రెడ్డి,భాస్కర్,సందీప్,అధినారాయణ,షకీల్,సాయి ,చోటు ,బొట్టు రామ్ పాల్గొన్నారు.

# బీసీ బిల్లు ఆమోదం కోసం కాంగ్రెస్ సర్కారు మడమ తిప్పని పోరాటం చేస్తుంది

### టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి, జులై 23(వాయిస్ టుడే): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూత్ ఐకాన్ చూసి యువత రాజకీయాల్లోకి రావాలని ఆసక్తి చూపిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. అన్నారు. బుధవారం గాంధీభవన్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి కాంగ్రెస్ పార్టీకి బిసిలపై నిబద్ధత లేదని బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు అంటుండు, బీఆర్ఎస్, బీజేపీ ఒకే తానూ ముక్కలని బిఆర్ఎస్ సపోర్ట్ తో గెలిచిన బీజేపీ ఎంపీలకు సిగ్గు ఉంటే బిసి బిల్లుకు సపోర్ట్ చేయాలని, మోడీ తెలంగాణ పై విషం చిమ్ముతూ సహరించట్లేదని, ఇప్పటికైన బీజేపీ నేతలు జిత్తులు మానండి, రాష్ట్ర అభివృద్ధి లో బాగస్వామ్యులు కావాలంటున్నార. దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలుచేసే నిర్ణయం తీసుకోవడం కాంగ్రెస్ పార్టీ గొప్పతనాన్ని చూపుతోందని, బీఆర్ఎస్ పార్టీ అడ్రస్ లేకుండా పోవడంతో పాటు కార్యకర్తలకు కూడా గమ్యం లేకుండా పోయిందని, పార్టీలో అధికారం కోసం లోపాయికారిగా పోరు కొనసాగుతోందని, ప్రజల సమస్యలపైన వారికి దృష్టి లేకుండా పోయిందని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల సంక్షేమానికి చేసిన పనులు ఏమిటో చెప్పాలని, బీసీలపై ప్రేమ ఉంటే బీసీ నేతను పార్టీ అధ్యక్షుడిగా నియమించాలని, ఇప్పటి పరిస్థితిని గమనిస్తున్న ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని, కాంగ్రెస్ పార్టీ ఎన్నో కష్టాలను ఎదుర్కొని అధికారంలోకి వచ్చిందని, పార్టీలో వ్యక్తిగత కోపాలు, ఫిరాయింపులకు చోటు లేకూడదని ఇతర పార్టీలు మనలో ఐక్యతను దెబ్బతీయాలనే ప్రయత్నిస్తున్నాయని, కార్యకర్తలు అపోహలకు లోనుకాకుండా



పార్టీ పట్ల నిబద్ధతతో ముందుకు సాగాలని తెలిపారు. కేటిఆర్ కల్లు తాగిన కోతిలాగా మాట్లాడుతుండు కేటిఆర్ కు చెప్పుదెబ్బలు తప్పవని అన్నారు. సొంత చెల్లె కవితే కేటిఆర్ మాట వినట్లేదు ముఖ్యమంత్రి పై కేటిఆర్ భాషను సరిదిద్దుకోవాలి కవిత చేసిన లిక్కర్ దందా దేశంలో ఎవరు చేయలేదన్నారు. కేటిఆర్ ,హరీష్ రావు మాటలు చూస్తుంటే రంగులు మార్చే ఊసరవెల్లి లు కూడా సిగ్గు పడతాయి అన్నారు. రేవంత్ రెడ్డి ఫ్లైట్ మోడ్ లో ఉండు అని కవిత అంటుంది. అభివృద్ధి కోసం మడమ తిప్పని యోధుడు లాగ ఎన్ని సార్లు అయినా డిల్లికి పోతాడు, మీలాగా అవినీతి సొమ్ముతో కొనుక్కున్న సొంత ఫ్లైట్ లో డిల్లికి పోవట్లేదు కదా, కేటిఆర్ కు గర్వమే కాదు నోటి దూల, అహంకారం, బలుపు తో అధ:పాతాళానికి పోయిండు అని అన్నారు.కేసీఆర్ కుటుంబంలో నెలకొన్నఅంతర్గత కుమ్ములాట వల్ల రాష్ట్రంలో అశాంతి నెలకొంటున్నది అని, మొదట మీ కుటుంబ సమస్యలను పరిష్కరించుకోలేని మీరు రాష్ట్ర సమస్యలను ఏం పరిష్కరిస్తారు అని ఎద్దేవా చేసారు. బీఆర్ఎస్ హయాంలో రేవంత్ రెడ్డి, కోదండరెడ్డి, మందకృష్ణమాదిగ వంటి వారిని అరెస్టు చేసిన మీకు ఇవాళ కేసులు, అరెస్టులు అంటే ఎందుకు భయపడుతున్నారు. లక్షల కోట్లు దోచుకున్న దొంగలు మీరే బయట తిరుగుతుంటే తెలంగాణ సమాజం మిమ్మల్నెందుకు సహించాలి. మిడిమిడి జ్ఞానంతో కాళేశ్వరం కట్టారని ఇప్పుడు ఇరు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారు. కాళేశ్వరం ఇంత గొప్ప ప్రాజెక్టు అని చెప్పుకున్న వారు ఇప్పుడు ఆ గొప్పతనం మాదే అని చెప్పుకోవడానికి ఒక్కరూ ముందుకు రావడం లేదు అని రాష్ట్ర ఆర్థిక వెసులుబాటు లేని కారణంగానే కొన్ని పథకాల అమలు ఆలస్యం అవుతోందని త్వరలోనే అన్ని పథకాలు అమలు అవుతాయి అని అన్నారు. తొమ్మిదేళ్లుగా మీరిచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇవాళ కాంగ్రెస్ హామీలపై మాట్లాడితే నడువదు అని అన్నారు. బంగారు తెలంగాణ ఏమో గాని రాష్టాని అప్పుల అప్పులపాడు చేసిండు చింతమాడక చింటూ కాక రాష్ట్రాన్ని దివాలా తీసిండు 10 సంవత్సరాలలో ఏది చేసినా స్కాములు తప్ప అభివృద్ధికి నోచుకోలేదు తెలంగాణ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఇదేనా దోచుకోవడానికి దాచుకోవడానికా ప్రశ్నిస్తుంది తెలంగాణ ప్రజానీకం అని అన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించేలా రాహుల్ గాంధీ ఆలోచన చేస్తున్నారు. రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ ఆలోచనలతో నిబద్ధత తో కులగణన చేసిండు, బిసి బిల్లు కోసం సీఎం రేవంత్ మడమ తిప్పని మాట తిప్పని పోరాట యోధుడుగా పోరాటం చేస్తుండు, రేవంత్ రెడ్డి లీకు వీరుడు అని అంటున్నారు. రేవంత్ రెడ్డి లీకు వీరుడు కాదు పోరాట యోధుడు కేవలం 18 సంవత్సరాలలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షుడుగా, ముఖ్యమంత్రిగా అయిండు అని, రేవంత్ రెడ్డి యూత్ ఐకాన్ రేవంత్ రెడ్డిని చూసి యువత రాజకీయాల్లోకి రావాలని ఆసక్తి చూపిస్తున్నారు అన్నారు. ఇప్పుడు వచ్చింది ప్రజా ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం ఇది రేవంత్ అన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎన్నో ఇంకా ఎన్నో పథకాలతో ముందుకు సాగాలని కోరుకుంటున్నాం అని అన్నారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే వారి సంగతి బీసీ సంఘాల నాయకులే చూడాలన్నారు.

# తెలంగాణ బీసీ జర్నలిస్టులు సంఘటితశమై రాజ్యాధికార ఆస్తిత్వ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలి

## తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్





హైదరాబాద్, జులై 23(వాయిస్ టుడే): రాష్ట్రంలో జరుగుతున్న బీసీ జర్నలిస్టులు సంఘటితమై రాజ్యాధికార ఆస్తిత్వ ఉద్యమంలో భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. బీసీ జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో బీసీ జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రసార మాధ్యమాల్లో అత్యధికంగా బీసీ జర్నలిస్టులే పనిచేస్తున్నారని, వారి కృషితోనే ఆయా మాధ్యమాల మనుగడ సాగుతుందన్నారు. రాష్ట్రంలోని ఆన్ లైన్ పేపర్లు, యూట్యూబ్ చానెళ్లలో సైతం బీసీ జర్నలిస్టులే అగ్రభాగాన నిలిచారని, ముఖ్యంగా చిన్న పత్రికల్లో సైతం వారే కీలకమన్నారు. ప్రభుత్వం ఆయా మాధ్యమాల్లో అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్లు, చిన్న పత్రికల వారికి ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సరైన శిక్షణ లేక గ్రామీణ, మండల ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు కేవలం జిల్లా స్థాయికే పరిమితమవుతున్నారన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ తరపున బీసీ జర్నలిస్టుల కోసం రెండు రోజుల ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించాలని, తద్వారా సీఈవో, ఎడిటర్లుగా ఎదిగేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. రాష్ట్రంలో త్వరలోనే జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను చైతన్యపర్చడంలో బీసీ జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలన్నారు. ముదిరాజ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతల నీలకంఠం ముదిరాజ్ మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే ప్రభుత్వానికి చిన్న పనేనని, కాని ఆ అంశం మోచేతిపై బెల్లంలా మార్చారన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్యపర్చడంలో జర్నలిస్టులు విశేష పాత్ర పోషించారని, అదే స్ఫూర్తితో 42 శాతం రిజర్వేషన్లు సాదించుకునేందుకు బీసీ జర్నలిస్టులు ఉద్యమించాలని



పిలుపునిచ్చారు. 58.5 ఉన్న బీసీలకు కేవలం 42 శాతం మాత్రమే ఉన్నట్లు లెక్కలు చూపుతున్నారని, ఐదు శాతం ఉన్న వారు మాత్రం అగ్రపదవుల్లో కొనసాగుతున్నారన్నారు. బీసీలకు న్యాయం జరుగాలంటే ముందుగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ జర్నలిస్టుల ఐక్యతను చాటుతూ త్వరలోనే పది వేల మందితో సభను నిర్వహిస్తామన్నారు. మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరమ్ ముఖ్య సలహాదారులు సీనియర్ జర్నలిస్ట్ సుంకరి రామ్మూర్తి అమెరికా నుండి వీడియో కాల్ ద్వారా తన సందేశాన్ని సలహాలు పలు సూచనలు బీసీలకు వేదిక నుండి తెలియచేశారు. యాదవ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మేకల కృష్ణ యాదవ్ మాట్లాడుతూ దేశంలో జరిగిన మండల్ ఉద్యమంలో అధిపత్య కులాల్లో ఉన్న జర్నలిస్టులతో పాటు ఆ వర్గాలన్నీ బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారని, నాడు బీసీ జర్నలిస్టులు ఐక్యతగా తమ గళం వినిపించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న జీవో ప్రభుత్వం తీసుకువచ్చిందని, కాని అది ఎక్కడా అమలవుతున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. విద్యాహక్కు చట్టంలోనే 50 శాతం రాయితీ ఇవ్వాలన్న నిబంధన ఉందని తెలిపారు. ఈ విషయంపై మీడియా అకాడమీ, యూనియన్లు ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. విశ్వకర్మ జర్నలిస్టు సంఘం అధ్యక్షులు గుండోజు శ్రీనివాస్ మాట్లాడుతూ శాసన మండలిలో ఉపాధ్యాయులు, పట్టభద్రులే కాదు, జర్నలిస్టులకు సైతం ప్రత్యేక కోటా పెట్టి ఎమ్మెల్సీ ఇవ్వాలని, అది కూడా బీసీల జర్నలిస్టులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ దాదె వెంకట్ పటేల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు సంఘం అధ్యక్షులు తూములూరి సత్యనారాయణ, గౌడ జర్నలిస్టు సంఘం ప్రతినిధి సీఆర్ జానకిరామ్, క్షత్రియ సమాజ్ జర్నలిస్టు సంఘం ప్రతినిధి భవ్ సార్, సీనియర్ జర్నలిస్టులు సంపత్, గౌడ జర్నలిస్ట్ ఫోరమ్ ప్రధాన కార్యదర్శి శివకృష్ణ గౌడ్, శ్రీనివాస్, ఎం. ప్రభాకర్ ముదిరాజ్, బోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.



## తెలంగాణ పరిశ్రమలకూ కేంద్ర ప్రభుత్వానికీ నడుపులుగా నిలుస్తాను



### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నందూరి రామచందర్ రావు, FTCCI సమావేశంలో హామీ

తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవిని స్వీకరించిన తర్వాత తన తొలి రాజకీయేతర సభలో పాల్గొన్న శ్రీ నందూరి రామచందర్ రావు, బుధవారం సాయంత్రం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (FTCCI) నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడుత తెలంగాణ పరిశ్రమల సమస్యలను కేంద్రానికి చేరవేసే ఒక బ్రిడ్జిగా నేను పనిచేస్తానుఅని చెప్పారు. తెలంగాణలో సమగ్ర పారిశ్రామిక అభివృద్ధికి రోడ్మ్యాప్ అనే అంశంపై MSME రంగంపై దృష్టి పెట్టుతూ ఈ ఇంటరాక్టివ్ సమావేశం నిర్వహించబడింది. బీజేపీని కార్పొరేట్‌లకు అనుకూలమైన ప్రభుత్వం అని కొంతమంది అంటారుకానీ పరిశ్రమలు లేకుండా దేశాన్ని నడిపించగలమా? చిన్నా పెద్దా పరిశ్రమలే ఉపాధిని సృష్టించేవి, ఆర్థికాభివృద్ధికి మూలస్తంభాలు వీటివల్లే ఆదాయ వనరులు ఉత్పత్తి పన్నులు మరియు సంపద పెరుగుతాయి అని పేర్కొన్నారు.



## మహబూబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా నియమించండి

### తొర్రూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాన్ల తిరుపతిరెడ్డి

తొర్రూరు, జులై 23 వాయిస్ టుడే : మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియమించేందుకు తన పేరును పరిశీలించాలని తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాన్ల తిరుపతిరెడ్డి బుధవారం హైదరాబాదులో గాంధీభవన్ ఇంచార్జ్ , టిపిసిసి ఉపాధ్యక్షులు కుమార్ రావు ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాద్ జిల్లా అధ్యక్ష పదవికి తాను అన్ని విధాలుగా అర్హతతో ఉన్నానని తన పేరును పరిశీలించి జిల్లా అధ్యక్ష పదవి వచ్చే విధంగా చేయాలని కోరారు. టిపిసిసి ఉపాధ్యక్షులను కలిసిన వారిలో పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరి ప్రసాదరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామ సహాయం కృష్ణ కిషోర్ రెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మెరుగు మల్లేశం గౌడ్ ఉన్నారు.



## ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యాట పోతూ.. పట్టుబట్టలను లబ్ధిదారులకు అందజేసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య యాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండలంలో మంగళవారం రోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పర్యటించారు. ఈ పర్యటన లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పలు భవనాలను,సీసీ రోడ్లను ప్రారంభించారు. మోటకొండూరు మండలం కదిరేని గూడెం గ్రామంలో శామల నర్సమ్మ, వారి కొడుకు కోడలు లక్ష్మి అశోక్ ల ఇందిరమ్మ ఇళ్లను గృహ ప్రవేశం చేసి వారికి పట్టు బట్టలు పెట్టి ఇచ్చిన మాట ప్రకారం యాట పోతును అందజేశారు.. గృహప్రవేశం చేసి ప్రత్యేక పూజా నిర్వహించారు. ఆ తర్వాత ఇల్లును సందర్శించి వంటగదిలో పాలు పొంగించారు. ఇందిరమ్మ ఇల్లు వచ్చినందుకు వారికి శుభాకాంక్షలు తెలిపారు. గత కొన్నిఏళ్లుగా ఇల్లు కట్టుకోలేని స్థితిలో కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు రావడంతో చాలా సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీర్ల ఐలయ్య లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సనాతన హిందూ సేవా సమితి దాతృత్వం




వరంగల్ ( వాయిస్ టుడే ) జూలై 23 : సనాతన హిందూ సేవ సమితి సభ్యులు తమ 90 వ సేవా కార్యక్రమన్ని, ఏ ఆధారం లేక ఆరోగ్య సమస్యలు మరియు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండి దాతల సహాయం తో బతుకుతున్న నగరం లోని కరీమాబాద్ ఎస్ ఆర్ ఆర్ తోట కు చెందిన వెల్ది పరమేశ్వరి శివరాజ్ అనే వృద్ధ దంపతులకు రెండు నెలలకు సరిపడా బియ్యం అలాగే నిత్యావసర వస్తువులు అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమం లో గ్రూప్ వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, గ్రూప్ సభ్యుడు గంగిడి ధర్మారెడ్డి పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి లాభాలు




తొర్రూరు, జులై 23 వాయిస్ టుడే : మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ సంస్థకు లాభాలు రావడం హర్షనీయమని తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం వినియోగించుకున్న శుభ సందర్భంగా బుధవారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మహిళా ప్రయాణికులను, డ్వాక్రా మహిళలను సత్కరించారు.

డి ఎం పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్, ఎంపీడీవోలు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో మహిళలకు భద్రత, ఆర్థిక ప్రయోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించిందని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ జీరో టికెట్లు జారీ చేసి, టికెట్ల చార్జీల్ని ప్రభుత్వం భరించి ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకువస్తుందన్నారు. మహాలక్ష్మి పథకంతో మహిళలు కు ప్రతినెలా అయ్యే రవాణా ఖర్చులు పూర్తిగా తగ్గాయన్నారు. డిఎం పద్మావతి, ఎంఈఓ బుచ్చయ్య మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకాన్ని దిగ్విజయంగా అమలు చేయడంలో ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్ల పాత్ర ప్రశంసనీయమని తెలిపారు. ఈ పథకంతో ఆర్టీసీ సంస్థ రూ.6,671 కోట్లు ఆర్జించిందని తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీ సంస్థను ఆదరించి కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ విజయ్ కుమార్, ఎం సి గోపాల్ రెడ్డి, ఎస్ఎం మల్లికార్జున్, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మాధాపూరంలో తీన్మార్ మల్లన్న పెద్ద కూతురు పుట్టినరోజు సందర్భంగా షూ పంపిణీ

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: తీన్మార్ మల్లన్న పెద్ద కుమార్తె చిన్నారి చింతపండు సక్పాల్ పటేల్ 7వ జన్మదిన సందర్భంగా ఆలేరు నియోజకవర్గంలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థిని,విద్యార్థులకు షూ పంపిణీ లో బాగంగా ఈ రోజు తుర్కపల్లి మండలం, మాధాపూరం లో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షూ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులు గా హజరైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మరియు జిల్లా కలెక్టర్ యం .హనుమంతు రావు ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి పొలిటికల్ జె.ఏ సి కోఆర్డినేషన్ కమిటి చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్ జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ,మాధాపూరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి మాలతి మరియు స్థానిక ప్రజాప్రతినిధులు ,మండల పరిధిలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. రాజాపేట ప్రభుత్వ పాఠశాలలో తుర్కపల్లి మండలం ఇబ్రహీం పూర్ గ్రామంలో కన్నుల పండగ గాప్రభుత్వ పాఠశాలల్లో పుట్టినరోజు సందర్భంగా షూ పంపిణీ చేశారు.






## జన వికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

తొర్రూరు, జులై 23 వాయిస్ టుడే : మండలంలోని చర్లపాలెం గ్రామంలో జన వికాస ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహ హాస్పిటల్ హనుమకొండ సహకారంతో బుధవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వై. అశోక్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ తేజస్విని బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. మహిళలు చాలా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటూ వారి యొక్క ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు పాటించడం లేదని అన్నారు.ఆరోగ్యాన్ని చెక్ చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా రకరకాల క్యాన్సర్ బారిన పడుతున్నారని, తగు జాగ్రత్తలు తీసుకొని అప్పుడప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు.200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస మెయిన్ కోఆర్డినేటర్ మద్దెల రమ, హాస్పిటల్ సిబ్బంది సుభాష్, కృష్ణవేణి, స్రవంతి, రాజేష్, గ్రామపంచాయతీ కారోబార్ స్వప్న,తదితరులు పాల్గొన్నారు.



## 317 G.O బాధితులకు న్యాయం చేయాలి

### తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం

తొర్రూరు, జులై 23 వాయిస్ టుడే : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈరోజు సభ్యత్వ నమోదు కార్యక్రమం దంతాల పల్లి మండలంలోని వివిధ పాఠశాలలో చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బండా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్ డీ.ఏలను పి.ఆర్సి ని వెంటనే ప్రకటించాలని, 317 సబ్ కమిటీ రిపోర్ట్ బయట పెట్టి 317 బాధితులకి న్యాయం చేయాలి అని అదేవిధంగా అన్ని రకాల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని. హడహాక్ పద్ధతి లో ప్రమోషన్స్ ఇవ్వాలి అని వివిధ గురుకులాలలో పనిచేస్తున్న వారికి ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా సమయసారిని ఉండాలని, ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాద్యులు శ్రవణ్ కుమార్ గారు, సంఘ భాద్యులు మధుకర్ గారు దంతాలపల్లి గౌరవ అధ్యక్షులు హరిబాబు గారు మండల ప్రధాన కార్యదర్శి మహేందర్ మొదలగు వారు పాల్గొన్నారు.

## బొగ్గు ఉత్పత్తులపై కేంద్రం విధానంపై ప్రశ్నించిన ఎంపీ కావ్య

### పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య

### బొగ్గు విక్రయ విధానాలను వివరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హనుమకొండ, వాయిస్ టుడే: ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాల్లో బొగ్గు ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై స్పష్టత కోరుతూ లోక్‌సభలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు. లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు సమాధానంగా, సింగరేణి బొగ్గు గనుల కంపెనీ లిమిటెడ్ బొగ్గు విక్రయ విధానాలను వివరించిన కేంద్ర మంత్రి సంస్థ అనుసరిస్తున్న విధానాలు పారదర్శకతను పెంపొందించడమే కాకుండా, తెలంగాణ పరిశ్రమల అభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు. శక్తి విధానం (2017, 2025లో నవీకరణ), నాన్-రెగ్యులేటెడ్ సెక్టార్ లింకేజ్ వేలం విధానం (2016, 2020లో మార్పు), న్యూ కోల్ డిస్ట్రిబ్యూషన్ పాలసీ (2007, 2022 వరకు సవరింపు), బ్రిడ్జ్ లింకేజ్ పాలసీ (2016) వంటి కేంద్ర బొగ్గు శాఖ విధానాల ప్రకారం సింగరేణి బొగ్గు గనుల కంపెనీ లిమిటెడ్ తన బొగ్గు సరఫరాను నిర్వర్తిస్తోందని మంత్రి వివరించారు. ఈ విధానాల అమలుతో పారదర్శకత, సమాన అవకాశాలు, పరిశ్రమలకు మద్దతు, ఉపాధి అవకాశాల పెరుగుదల, అలాగే రాయల్టీ మరియు పన్నుల రూపంలో రాష్ట్రానికి భారీ ఆదాయం లభిస్తోందన్నారు. ఇది తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. 2025లో సవరించిన శక్తి విధానం ఆధారంగా పవర్ రంగానికి కొత్త బొగ్గు లింకేజీలు మంజూరు చేయడమవుతోందని ఆయన తెలిపారు. ఈ విధానాల వల్ల తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలకు స్థిరమైన బొగ్గు సరఫరా లభించడంతో పాటు పోటీతత్వ ధరల ద్వారా వ్యాపార వ్యయాలు తగ్గుతుండటంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థలలో నాణ్యమైన మెనూను అమలు చేయాలి

### విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

### ప్రభుత్వ విద్యా సంస్థలకు స్వంత భవనాలు నిర్వహించాలి

### బిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ జక్కనపల్లి గణేష్



కరీంనగర్,జూలై 23(వాయిస్ టుడే): ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం, సంక్షేమ హాస్టల్స్ లలో నాణ్యతతో కూడిన మెస్ మెనూ కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బిఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ జక్కనపల్లి గణేష్ డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యాసంస్థలలో ఖాళీగా ఉన్నటువంటి టీచింగ్, నాన్-టీచింగ్ ఉద్యోగ ఖాళీలు అన్నింటిని భర్తీ చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్నటువంటి ఎనిమిది వేల కోట్ల రూపాయల స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించి, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు.అద్దె భవనాలలో కొనసాగుతున్న ప్రభుత్వ విద్యాసంస్థలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి హాస్టల్ సీట్ అందించాలన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. పెరిగిన మార్కెట్ ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

### రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మాత్యులు కొండా సురేఖ

### దేశాయిపేట ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన



వరంగల్( వాయిస్ టుడే ) 23 జులై : పేద ప్రజల అభివృద్ధి సంక్షేమమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం వరంగల్ తూర్పు జిడబ్ల్యుఎంసి పరిధిలోని 12వ డివిజన్ దేశాయిపేట ఎస్సీ కాలనీ ప్రాంతంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు,జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి స్థానిక కార్పొరేటర్ కావేటి కవితతో కలిసి ఇళ్ల నిర్మాణ పనులను మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ ప్రతులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ అధికారులతో కలిసి దేశాయిపేట ఎస్సీ కాలనీలో కలియ తిరుగుతూ అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతులను పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మించుకోవాలని, నియోజకవర్గానికి 3500 ఇల్లు మొదటి విడతలో మంజూరయ్యాయని, రెండో విడతలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులను ఏమాత్రం ఆలస్యం చేయడం లేదని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందేలా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని అన్నారు. మధ్య దళారుల ప్రమేయం ఉంటే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ఇందిరమ్మ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగిస్తున్నదని, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఉగాది నుండి రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, ఆరోగ్యశ్రీ పరిస్థితిని 10 లక్షల రూపాయలకు పెంపు,కొత్త రేషన్ కార్డుల జారీ, మహిళలకు ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి పేదవాడి కల ఇందిరమ్మ ఇల్లు సొంతమయ్యేలా నిర్మిస్తున్నామన్నారు. మొదటి విడుదల రాష్ట్రవ్యాప్తంగా 22 వేల 500 కోట్ల రూపాయలతో నాలుగు లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అర్హులు అధైర్య పడాల్సిన అవసరం లేదని మంత్రి హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల దేవదాయ శాఖకు 176 కోట్ల రూపాయలు ఆదాయం లభించిందని మంత్రి తెలిపారు.

గతంలో చేసిన అభివృద్ధి తప్ప గత 10 పది ఏళ్లలో అభివృద్ధి జరగలేదన్నారు. కొండ దంపతులు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనుల వల్లే ప్రజలు ఆశీర్వదించడం వల్ల ఎమ్మెల్యే, మంత్రి అయ్యానని, తూర్పు నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తూ అన్ని డివిజన్లను పూర్తిస్థాయిలో పూర్తి చేస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న షాదిఖానను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. మహిళలు తలచితే ఏదైనా సాధిస్తారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో 6 గ్యారంటీలు మహిళల పేరు మీదే నామకరణం చేయడం జరిగిందన్నారు. వసతి గృహాల్లో విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచడంతోపాటు 200% కాస్మెటిక్ చార్జీలను పెంచడం, పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు మెప్మా ద్వారా కుట్టించిన యూనిఫామ్ లు పాఠ్యపుస్తకాలు అందించి ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలలను బలోపేతం చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. కోటి మహిళలను కోటీశ్వరులు చేయాలని ఉద్దేశంతో మహిళలకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ ప్లాంట్లు, తూర్పు లోని 5 మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ ద్వారా ఐదు బస్సులను అద్దెపై నిర్వహించుకొనుటకు మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

వెనుకబడిన తరగతుల వారికి కమ్యూనిటీ హాల్ లకు బదులు మ్యారేజ్ హాల్ లను నిర్మించుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసుకోవాలని, పురోగతిని బట్టి లబ్ధిదారులకు ప్రతి సోమవారం జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు చెల్లింపులు జరుపుతున్నామన్నారు. మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా నాలుగు విడతల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. బేస్మెంట్ పూర్తి అయిన తర్వాత లక్ష రూపాయలు గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత 1.25 లక్షలు, స్లాబ్ పూర్తయిన తర్వాత 1.75 లక్షలు, మిగిలిన పనులు పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు విడుదల చేస్తున్నామన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలను మాత్రమే మేస్త్రీలకు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉంటే మహిళ సంఘాల ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రుణం ఇప్పించడం జరుగుతుందన్నారు. 500 ఎస్ ఎఫ్ టి వరకే నిర్మించుకునేలా సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లు పర్యవేక్షిస్తూ లబ్ధిదారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీధర్ రావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరిలో మధ్య దళారుల సమయం లేకుండా చూడాలని, అలాంటి దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసిపి శుభం ప్రకాష్, కార్పొరేటర్ బసవరాజు కుమార్,బల్దియా ఉప కమిషనర్ ప్రసన్న రాణి, సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, తాసిల్దార్ ఇక్బాల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకంతో మహిళల్లో సాధికారత



**- మహాలక్ష్మి పథకంతో ప్రతి మహిళలో చిరునవ్వు**

**- ఆర్టీసీలో ఉచిత ప్రయాణం.. మహిళలకు అసలైన గౌరవం**

**- రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ.**

**- వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్‌లో జరిగిన మహాలక్ష్మి సంబరాల్లో పాల్గొన్న మంత్రి**

వరంగల్( వాయిస్ టుడే ) 23 జూలై : మహాలక్ష్మి పథకంతో మహిళలకు సాధికారత చేకూరుతున్నదని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 200 కోట్ల ఉచిత ప్రయాణం చేసి 6680 కోట్ల రూపాయల ప్రయాణ చార్జీలను ఆదా చేసుకున్న సందర్భంగా వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్ లో నిర్వహించిన సంబరాల్లో మంత్రి కొండ సురేఖ ముఖ్యఅతిథిగా హాజరై, నగరమేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, సిడబ్ల్యుఎంసీ కమిషనర్ చాహత్ భాజ్ పేయి లతో కలిసి ఆమె కేక్ కట్ చేశారు. మహాలక్ష్మి తో మహిళా సాధికారతపై విద్యార్థులకు, మహిళలకు నిర్వహించిన వ్యాసరచన, రంగోలి పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బస్ స్టేషన్ లో మహిళా స్వయం సహాయక సంఘాలచే ఏర్పాటుచేసిన వివిధ రకాల ఉత్పత్తుల స్టాల్స్ ను మంత్రి, మేయర్, కలెక్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో ప్రతి మహిళ ముఖంలో చిరునవ్వు కనబడుతోందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల మహిళలకు అసలైన గౌరవం దక్కుతున్నదన్నారు. మహాలక్ష్మి పథకాన్ని ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేస్తున్నాయని మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటివరకు 15.43 కోట్ల మంది మహిళా ప్రయాణికులు ఉచితంగా ప్రయాణించడం ద్వారా 690 కోట్ల రూపాయలు ఆదా చేసుకోగా, వరంగల్ జిల్లాలో 4.54 కోట్ల మహిళలు ఉచితంగా ప్రయాణం చేసి సుమారు190 కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని మంత్రి తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా సెర్ప్ ఆధ్వర్యంలో ఆర్టీసీ లో అద్దెపై నిర్వహించుటకు మహిళా సంఘాలకు బస్సు తాళాలు మంత్రి అందజేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఐదు మహిళా సంఘాలకు ఐదు ఆర్టీసీ బస్సులను అద్దెపై నిర్వహించుటకు త్వరలో అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్లలో మహిళా సంఘాల ద్వారా తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుటకు స్టాల్స్ కేటాయించాలని అధికారులను సూచించారు.

ఉచిత బస్సు ప్రయాణం వల్ల దేవదాయ శాఖకు అదనంగా 176 కోట్ల రూపాయల ఆదాయం సమకూరిందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళల స్వాలంబనే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. జిడబ్ల్యుఎంసి ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో నైపుణ్య కేంద్రాలను ఏర్పాటుచేసి మహిళలకు శిక్షణ ఇప్పించి కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్లో ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, స్థానిక కార్పొరేటర్ అనిల్, డి ఆర్ డి ఓ కౌసల్యా దేవి, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ ఎం భాను కిరణ్, డిపో మేనేజర్, ధరమ్ సింగ్, తహసిల్దార్ ఇక్బాల్ మెప్మా డి ఎం సి రేణుక, టీఎంసీ రమేష్ పాల్గొన్నారు.

# ప్రజలు కాంగ్రెస్ మాయమాటలను , నాటకాలను నమ్మే పరిస్థితి లేదు

**జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు**

**స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చాటి చెబుతాం కాషాయ జెండా ఎగరవేస్తాం**

**బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి**



రామడుగు, జూలై 23(వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీ లోగడ ఎన్నికల సందర్భంగా అధికారంలోకి రావడం కోసం 6 గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిందని,నేడు త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసం మళ్లీ కొత్త రాజకీయ డ్రామాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొదలుపెట్టిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు.బిజెపి రామడుగు మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల కార్యాశాల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆరు గ్యారంటీలతో, 420 హామీలతో ప్రజలను ఆదుకుంటామని కాంగ్రెస్ మాయమాటలు, అబద్ధాలు చెప్పి ప్రజానీకాన్ని మోసం చేసిందన్నారు. పథకాల అమలు కోసం దాదాపు రెండేళ్ల కాలంగా కాంగ్రెస్ సర్కార్ ప్రజా పాలన పేరిట ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి చేతులు దులుపుకోవడం తప్ప ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. అరకోర పథకాలను అమలు చేస్తూ , ఇష్యూ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఒక్కటి సక్రమంగా అమలైంది తప్ప, మిగతా ఏ ఒక్కటీ అమలు కాలేదని ఆయన ఆరోపించారు. రైతు రుణమాఫీ అరకోర చేసిందని, పింఛన్లు అందించడం లేదని, నిరుద్యోగ భృతిని అటకెక్కించిందని , ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ చెప్పిన లెక్కలేనన్ని హామీలు ఉన్నాయని తెలిపారు.కాంగ్రెస్ పార్టీవన్నీ ఉద్దెర ముచ్చట్లనే విషయం ప్రజలందరికీ అర్థమైందని,మాటల గారడితో ప్రజలను మోసగించడం కాంగ్రెస్కే చెల్లిందన్నారు.కాంగ్రెస్ చేస్తున్న మోసానికి ప్రతిఫలం లభించిందని ,అందుకే లోగోడ జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ ప్రభుత్వానికి ఉద్యోగులు, పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. ప్రస్తుతం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం మళ్లీ కాంగ్రెస్ సర్కార్ లబ్ధి పొందడానికి కుటిలప్రయత్నాలు,రాజకీయాలు మొదలుపెట్టిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశంతో రాజకీయ నాటకాలు మొదలుపెట్టిందని ఆయన విమర్శించారు. 10శాతం రిజర్వేషన్లు ముస్లింలకు వర్తించే విధంగా బీసీ రిజర్వేషన్ ను చేపట్టిందన్నారు. దీనివల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. జరగబోయే జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు దిమ్మదిరిగే ఫలితాలు అందిస్తారని ఆయన జోస్యం చెప్పారు.కాంగ్రెస్ ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన, ప్రజలను మభ్య పెట్టాలని ప్రయత్నించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి జరగబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం లభిస్తుందన్నారు. ప్రజలంతా బిజెపి మోదీ కేంద్ర ప్రభుత్వ పనితీరుపై విశ్వాసంతో ఉన్నారన్నారు. గ్రామాల్లో మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతుందనే విషయం ప్రజలకు అర్థమైందన్నారు. అందుకే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చాటేలా తగిన కార్యాచరణలతో ముందుకు కొనసాగడం జరుగుతుందని తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్, మండల శాఖ అధ్యక్షులు మోడీ రవీందర్,జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్,స్టేట్ కౌన్సిల్ మెంబర్ జిన్నారం విద్యాసాగర్,మాజీ మండల శాఖ అధ్యక్షులు ఒంటెల కరుణాకర్ రెడ్డి,ఎన్నికల ప్రభరి జాడి బాల్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పు శ్రీనివాస్ పటేల్,బండ తిరుపతి రెడ్డి,వివిధ మోర్చాల అధ్యక్షులు, నాయకులు,శక్తి కేంద్రం ఇంఛార్జిలు, బూత్ కమిటీ అధ్యక్షులు,కార్యకర్తలు హాజరయ్యారు.



## లోతట్టు ప్రాంతాలను సందర్శించిన మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్

జమ్మికుంట జూలై 23 (వాయిస్ టుడే) : జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి, పిట్టలవాడ, క్రిష్ణ కాలనీ, అంబేద్కర్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ లోతట్టు ప్రాంతాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ సిడిఎంఏ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మే, జూన్ నెలలో డ్రైన్ లోని షిల్ట్ ను ముందుగానే తొలగించడం జరిగిందన్నారు. రానున్న మూడు రోజులు వర్షాలు అధికంగా ఉన్నందున మున్సిపల్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మున్సిపల్ సిబ్బందిని మూడు టీంలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అత్యవసరమైన సమయంలో మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువస్తే సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఏఈ వికాస్, శానిటరీ ఇన్స్ పెక్టర్ మహేష్, ఈ ఈ శ్రీ కాంత్, మున్సిపల్ జవాన్లు, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు తహసిల్దార్ ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రం



ఇల్లందకుంట జూలై 23 (వాయిస్ టుడే): ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు ఇల్లందకుంట మండల తాహసిల్దార్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి కి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యు.ఎస్.పి.సి.నాయకులు, డిటిఎఫ్ ఇలందకుంట మండల అధ్యక్షులు సార్ల సంపత్ మాట్లాడుతూ అన్ని క్యాడర్ల బదిలీలు వెంటనే చేపట్టాలని, అదేవిధంగా గెజిటెడ్ హెడ్మాస్టర్, స్కూల్ అసిస్టెంట్, ప్రైమర్ స్కూల్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, వెంటనే పిఆర్సి నివేదికను తెప్పించుకొని 01.07. 2023 నుంచి పిఆర్సి అమలు చేయాలని కోరినారు. జమ్మికుంట జోన్ కన్వీనర్ ఏబూసి శ్రీనివాస్ మాట్లాడుతూ జీవో 25ను సవరించాలని, ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని, ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులు దాటితే ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరినారు. ఇల్లంతకుంట మండల డిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వేణు మాట్లాడుతూ ఉపాధ్యాయుల జిపిఎఫ్ పార్ట్ ఫైనల్ బకాయిలను, పదవి విరమణ పొందిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల పెన్షన్స్ బకాయిలను, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరినారు.

# పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయంబర్స్ మెంట్స్ విడుదల చేయాలి

**రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలి.**

**ఎన్ ఈపి-2020 రద్దు చేసి, తెలంగాణ అసెంబ్లీలో అమలు చేయకుండా తీర్మానం చేయాలి.**

**వామపక్ష విద్యార్థి సంఘాలు**




కరీంనగర్, జూలై 23(వాయిస్ టుడే): వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ పాఠశాలలు, ఇంటర్ కళాశాలల బంద్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్,పీ డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు అంగటి కుమార్,పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి రాణప్రతాప్,ఏ ఐ ఎస్ బి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్,ఎఫ్ డి ఎస్ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీకాంత్, పి డి ఎస్ యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బత్తుల రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు పరుస్తున్న ఇతవరకు కూడా విద్యాశాఖ మంత్రిని నియమించాలి. రోజురోజుకి ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలలో ఫీజు నియంత్రణ చట్టం లేకపోవడం వల్ల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. విద్యార్థుల రావాల్సిన స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ దాదాపు 8,000 కోట్లకు పైగా ఈ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న పరిస్థితి ఉంది కావున పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. అదేవిధంగా కరీంనగర్ నడి ఒడ్డున ఉన్న ఆర్ట్స్ కళాశాల లో అనేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది కనీసం సరిపడా తరగతి గదులు లేని పరిస్థితి ఉంది, కళాశాలలో స్కావెంజర్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. సైన్స్ వింగ్ కళాశాలల శిథిలావస్థలో ఉన్న పరిస్థితి ఉంది నూతన భవనాన్ని ప్రారంభించి అసంపూర్తిగా ఉన్న పరిస్థితి ఉంది కావున భవన నిర్మాణన్ని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్, ఎంఇఓ, డిఇఓ, మరియు లెక్చరర్స్, ప్రిన్సిపాల్ పోస్టులు భర్తీ చేయాలి,అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాల, హాస్టల్స్ భవనాలుకు స్వంత భవనాలు నిర్మించాలి. గురుకులాల సమయాన్ని శాస్త్రీయంగా మార్చాలి.సంక్షేమ హాస్టల్లో పెండింగ్ మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలి, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. బడ్జెట్, చిన్న ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి.ఆర్థిక సహకారం అందించాలి అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఏఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్, వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారావు వెంకటేష్ ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి మచ్చ అభి సాయి, నాయకులు అక్షయ్, ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి బొగేశ్, గట్టు ఆకాశ్, అక్షయ్, పి డి ఎస్ యు రవితేజ, కొయ్యాడ బాబు, అరవింద్, భారత్ పాల్గొన్నారు.



## స్పెషల్ చీఫ్ సెక్రటరీని కలిసిన ఎమ్మెల్యేలు

**స్పోర్ట్స్ పాఠశాల, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పై చర్చించిన ఎమ్మెల్యేలు**

**స్పోర్ట్స్ పాఠశాలను ఆగస్టు 15న ప్రారంభానికి హామీ**

హనుమకొండ, వాయిస్ టుడే: హైదరాబాద్ టూరిజం ప్లాజా లోని తెలంగాణ స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్ ను ఆయన కార్యాలయంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కే.ఆర్ నాగరాజు కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ పాఠశాల మరియు అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటు పై ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు చర్చించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు అవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఉనికిచర్ల వద్ద జాతీయ రహదారి 163కి అనుకోని ఉన్న సర్వే నంబర్ 325లో 20 ఎకరాల ప్రభుత్వ స్థలంలో స్పోర్ట్స్ పాఠశాల ఏర్పాటుకు స్పష్టమైన హామీ ఇచ్చారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతుతో ఆగస్టు 15న స్పోర్ట్స్ పాఠశాలను ప్రారంభించేందుకు తాత్కాలిక భవనాన్ని, మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. కావున స్పోర్ట్స్ పాఠశాలను ప్రారంభించేందుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్ స్పోర్ట్స్ పాఠశాలను ఆగస్టు 15న ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



## భారీ వర్షంతో హౌసింగ్ బోర్డ్ కాలనీలలోని పలు ఇళ్లలోకి చేరిన వరద నీరు

**సహాయక చర్యలు చేపట్టిన బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్**

కరీంనగర్, జూలై 23(వాయిస్ టుడే): కరీంనగర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీకి వరద నీరు పోటెత్తి,కాలనీలో నీ పలు ప్రాంతాలు జలమయంగా మారాయి. పట్టణంలో కురిసిన భారీ వర్షానికి కాలనీలోని పలు ప్రాంతాల ఇళ్లలోకి వరద నీరు చేరింది. విషయం తెలుసుకున్న బిజెపి కాంటెస్టెంట్ కార్పొరేటర్ తోట సాగర్ స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ కి కాలనీలో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బందితో వర్షపు నీటిని క్లియర్ చేయించారు. అలాగే శివాలయం నుండి బైపాస్ వెళ్లే రోడ్డు కూడా వర్షం నీరును కూడా క్లియర్ చేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, శ్రీనివాస్, మహేష్, సంజీవ్, సుధాకర్, రవి, శ్రీనివాస్,రాజ్ పాల్గొన్నారు



## రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

**వరంగల్ రైతు డిక్లరేషన్‌తో రైతులకిచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ విస్మరించింది**

కరీంనగర్,జూలై 23(వాయిస్ టుడే): కాంగ్రెస్ రైతాంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని , రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ బిజెపి కిసాన్ మోర్చా కరీంనగర్ జిల్లా ఇన్చార్జి , రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ , జిల్లా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కిసాన్ మోర్చా నేతలు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో , వరంగల్ రైతు డిక్లరేషన్ తో రైతులకిచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు గడిచిపోయిందని,ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలన్నీ బేషరతుగా అమలు చేయాలని, వరంగల్ రైతు డిక్లరేషన్ లో పేర్కొన్న అంశాలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఎటువంటి ఆంక్షలు లేకుండా మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రూ.2 లక్షల రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేయాలని, పది రకాల పంటలకు వరి, మొక్కజొన్న, కందులు , సోయాబీన్ , పత్తి , మిర్చి , పసుపు ,ఎర్రజోన్న , చెరుకు , జొన్న పంటలకు రూ.500 బోనస్ చెల్లించాలని ,రైతు భరోసా ఎకరాకు 15 వేలు చెల్లించాలని,రైతు భరోసాను కౌలు రైతులకు వర్తింపజేయాలని , వ్యవసాయ కూలీలకు 12 వేలు చెల్లించాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని, సబ్సిడీపై రైతులకు వ్యవసాయ యాంత్రిక పరికరాలు అందించాలని, పండ్ల తోటను ఆదుకోవాలని, ప్రతి జిల్లాలో విజిలెన్స్, మానిటరింగ్ విభాగం ఏర్పాటుచేసి నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి , జిల్లా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి., జిల్లా ఉపాధ్యక్షులు బోనాల మోహన్, మహేందర్ రెడ్డి, బాల్ రెడ్డి పాల్గొన్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
గురువారం, 24 జూలై 2025

## ఆర్టీసీలో ఉచిత ప్రయాణం... మహిళలకు అసలైన గౌరవం

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, జూలై 23(వాయిస్ టుడే): మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందించడం వారికి దక్కిన అసలైన గౌరవమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి 6680 కోట్ల రూపాయలు ప్రయాణ చార్జీలను ఆదా చేసుకున్న సందర్భంగా కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్లో సంబరాలు నిర్వహించారు.ఈ వేడుకలకు హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతోమంది విద్యార్థులు, చిరు ఉద్యోగులు, కూలీలు, పట్టణంలో పాలు కూరగాయలు అమ్ముకునే మహిళలకు ఎంతగానో ఆర్థిక వెసులుబాటును కల్పించిందని అన్నారు. ఈ పథకం ద్వారా మహిళలు తమ ఖర్చు ఆదా చేసుకుని లబ్ధి పొందాలని అన్నారు. అంతేకాకుండా ఆర్టీసీ అద్దె బస్సులకు ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలను యజమానులుగా చేయడం గొప్ప విషయమని అన్నారు. అద్దె బస్సుల విధానం ద్వారా మహిళలకు ప్రతినెలా ఆదాయం సమకూరుతోందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత పథకాలు అమలు చేస్తూనే వారిని ఆర్థిక సాధికారత దిశగా తీసుకెళు తున్నందుకు సాటి మహిళగా ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధిస్తే సమాజంలో మరింత గౌరవప్రదంగా ఉంటారని సూచించారు. కరీంనగర్ రీజియన్ లో మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు 4 కోట్ల 83 లక్షల ప్రయాణాలు చేశారని, 201.82 కోట్ల రూపాయల లబ్ది చేకూరిందని తెలిపారు.పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ఆర్టీసీలో మహిళలకు కల్పించిన ఉచిత బస్సు సౌకర్యం వల్ల వారికి ఆర్థికంగా ఉపయోగకరంగా ఉందని అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీకి కావలసిన సహకారం అందిస్తున్నామని తెలిపారు. బస్టాండ్లలో ఎలాంటి ఘటనలూ జరగకుండా పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిరంతర సేవలు అందిస్తున్నామని అన్నారు.అనంతరం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. బస్టాండ్ లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ ని పరిశీలించారు. ఆర్టీసీ బస్సులో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సిపి గౌస్ ఆలం, ఆర్టీసీ అధికారులు బస్టాండ్ నుండి కలెక్టరేట్ వరకు ప్రయాణించారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్.భూపతిరెడ్డి పి.మల్లేశం , డిపో మేనేజర్ విజయ మాధురి, పిఓ సత్యనారాయణ,ఏవో శంకరయ్య పాల్గొన్నారు.



## వరద నీరు చేరిన ప్రాంతాలను సందర్శించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్, జూలై 23(వాయిస్ టుడే): రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల కరీంనగర్ పట్టణంలో వర్షపు నీరు లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి ప్రవేశించిన ప్రదేశాలను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పరిశీలించారు.వరద వల్ల వంట చేసుకోలేని బాధితులకు సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి రెండు పూటలా ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని, ప్రజలు అధైర్యపడకూడదని భరోసా ఇచ్చారు.

## స్వేరోస్ కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధిగా ఆకినపల్లి ప్రవీణ్



జమ్మికుంట జూలై 23 (వాయిస్ టుడే): అక్షరం,ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవం అనే అంశాలతో కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే కాకుండా దేశం నలుమూలల విస్తరిస్తూ అక్షరాన్ని ఆయుధంగా మార్చుకుని ఆత్మగౌరవంతో బ్రతకాలి అని గొప్ప ఉద్దేశంతో స్వేరోస్ నెట్వర్క్ ను స్థాపించిన మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పిన మాటలని నిత్యం అనుసరిస్తూ ప్రతినిత్యం తన అడుగుజాడల్లో నడుస్తూ గ్రామ గ్రామాన ఎవరెవరికి ఏ అవసరాలు ఉన్నాయో తెలుసుకుంటూ ప్రతి సమస్యకి పరిష్కారం చూపిస్తున్న గొప్ప నెట్వర్క్ లో ఈరోజు నిర్వహించిన జిల్లా కమిటీలో తనదైన శైలిలో స్వేరోస్ నెట్వర్క్ ని విస్తరిస్తున్న ఆకినపల్లి ప్రవీణ్ కి జిల్లా అధికార ప్రతినిధి పదవి రావడం చాలా సంతోషంగా ఉంది అని కమిటీని ఏర్పాటు చేసిన స్వేరో రాష్ట్ర కో కన్వీనర్ గడప రాజు మరియు సీనియర్ స్వేరో నాయకులు ఎర్ర రాజు అన్నారు. స్వేరోస్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షునిగా జెట్టిపల్లి అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్వేరోస్ ఫౌండర్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కి ఆకినపల్లి ప్రవీణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి: ప్రణవ్



హుజురాబాద్ జూలై 23 (వాయిస్ టుడే): మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో హుజురాబాద్ లోనీ అన్ని మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని,దానికి సంబంధించి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేసుకోవాలని,వర్షాకాలం వలన విష జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నందున,ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం రోజున 5 మండలాల ఎంపీడీవోలు,2 పట్టణాల కమిషనర్ లతో మాట్లాడి తగిన సూచనలు చేశారు. రైతులు వ్యవసాయానికి వెళ్ళే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని,కరెంట్ స్తంభాలు ఇతరత్ర సరి చూసుకోవాలనీ కోరారు.

# మహిళల చిరునవ్వులతో, ప్రభుత్వం మనుగడ

### మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు స్వేచ్ఛ భరోసా

### అన్ని సంక్షేమ పథకాలు మహిళలకె.

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూలై 23: మహిళల చిరునవ్వుతోనే ప్రభుత్వం మనుగడ సాగిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కొత్తగూడెం ఆర్టిసి బస్టాండ్ నందు 200 కోట్ల ఉచిత ప్రయాణాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఎస్పీ రోహిత్ రాజు స్థానిక సంస్థల అదనపు విద్యాచందన కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన రెండవ రోజే సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తూ మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 200 కోట్లు మంది ఇప్పటివరకు ప్రయాణాలు సాగించారన్నారు. దీని ద్వారా మహిళలకు ప్రయాణ చార్జీ రూపంలో 6680 కోట్లు ఆదా అయ్యాయి అని అన్నారు. ఈ మొత్తాన్ని ఆర్టీసీ సంస్థకు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఈ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు స్వేచ్ఛ భరోసా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కట్టుబడి అన్ని సంక్షేమ పథకాలను మహిళలకే రూపొందించింది అన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో మహిళా సంఘాల ద్వారా 9 బస్సులు నడుపుతున్నారు అని తెలిపారు. మహిళలను అభివృద్ధి పరచడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలతో ఏ సంక్షేమ పథకమైన ఇందిరమ్మ ఇల్లు, 500 గ్యాస్ సిలిండర్ తదితర పథకాలు అన్ని మహిళలకే రూపొందించడం జరిగిందన్నారు. మహిళలకు ఇవ్వడం ద్వారా తమ కుటుంబాల అభివృద్ధితోపాటు దేశ అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం పరుచుకొని మహిళలను అభివృద్ధి చెందాలన్నారు. దేశంలోనే ప్రభుత్వం చేపడుతున్న పథకాలు తెలంగాణ మోడల్ గా ఉన్నాయన్నారు. కొత్తగూడెం జిల్లా అభివృద్ధిలో భాగంగా కొత్తగూడెం నుండి హైదరాబాద్, నాగపూర్ రాజమహేంద్రవరం వరకు జాతీయ రహదారులు మంజూరు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కొత్తగూడెం ప్రధాన నగరంగా రూపాంతరం చెందుతుందన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి రహదారులతో పాటు విద్య, వైద్య రంగాలలో అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. మణుగూరు నుండి కిరండోల్ రైల్వే లైన్ నిర్మాణానికి మంజూరు కాగా పాండురంగాపురం నుండి భద్రాచలం వరకు 16 కిలోమీటర్ల రైల్వే లైన్ ను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. అదేవిధంగా కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ద్వారా పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు.కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఒకప్పుడు నష్టాలలో ఉన్న ఆర్టీసీ సంస్థ ప్రభుత్వం ఏర్పడిన 18 నెల కాలంలో 200 కోట్ల ఉచిత ప్రయాణాలతో 6680 కోట్ల రూపాయలు ఆదాయాన్ని గడించటం చాలా గొప్ప విషయం అన్నారు. ప్రభుత్వం దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కొత్తగూడెం పాల్వంచలో నూతన బస్టాండ్ల నిర్మాణం చేపట్టాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ... ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలు మహిళలు వారి కాళ్ళ మీద వారు నిలబడటం తో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి ఉపయోగపడుతున్నాయి అన్నారు . మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకొని మహిళలు ఉద్యోగాలకు, వైద్య అవసరాలకు, చదువుకోవడానికి ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగపడుతుందని దీని ద్వారా ఆత్మస్థైర్యాన్ని ప్రభుత్వం నింపిందన్నారు. అనంతరం జిల్లాలో మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసిన మహిలా విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులకు లబ్ధి చేకూరిన మహిళల కు మంత్రి బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టియుడబ్ల్యుజె (ఐజెయు) ఖమ్మం జిల్లా మహాసభ జయప్రదం చేయండి

ఖమ్మం , ఏప్రిల్ 23( వాయిస్ టుడే ): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టియుడబ్ల్యుజె-ఐజెయు) జిల్లా మహాసభలు నేడు ( ఏప్రిల్ 24) వైరా పట్టణంలో జరుగుతున్నాయని ఈ సభకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పాత్రికేయులంతా పాల్గొన్ని విజయవంతం చేయాలని ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నామా పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి శీలం శ్రీనివాస్, కోశాధికారి కళ్యాణ్ చక్రవర్తి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మహాసభకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క్ ,రాష్ట్ర సమాచార ,రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తోపాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఎంపిలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదిప్, జిల్లా పోలీస్ కమీషనర్ సునీల్ దత్, టియుడబ్ల్యుజె (ఐజెయు ) రాష్ట్ర అధ్యక్షులు వీరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె రాంనారాయణ ఇతర జాతీయ,రాష్ట్ర నాయకులు. హాజరు కానున్నట్లు తెలిపారు. వైరాలో శభరి గార్డెన్లో మహా సభ జరుగుతుందని తెలిపారు. జర్నలిస్టుల హక్కులు,సంక్షేమం కోసం పోరాడుతున్న ఐజెయు మహాసభల్లో జర్నలిస్టులంతా పాల్గొన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, ఏప్రిల్ 23 ( వాయిస్ టుడే): రాష్ట్రంలో భారీ వర్షాలు నేపథ్యంలో అధికారులతో మాట్లాడి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఖమ్మం, కరీంనగర్ జిల్లాలతో పాటు భారీ వర్షాలు పడుతున్న ప్రాంతాల్లో కలెక్టర్లు ఇతర అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి. రైతన్నకి ఎక్కడ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. పంటలకు ఏ విధమైన నష్టం జరగడానికి వీల్లేదు రైతులను అప్రమత్తం చేయండి. రైతులతో పాటు ప్రజలకు ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం ఇవ్వాలి. నదులు, ఏరులు జలాశయాలు వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలి అంచనా వేయాలి. ముంపుము ముప్పు ఉన్న ప్రాంతాలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి. అధికారులు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఎక్కడ ఎటువంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి.

## రాజాపూర్ పోలీస్ స్టేషన్ సందర్శించిన ఎస్పీ డి.జానకి




(వాయిస్ టుడే ప్రతినిధి) మహబూబ్ నగర్ జిల్లా జులై 23 : (జడ్చర్ల) రాజాపూర్ మండలం పోలీస్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా కొనసాగించేందుకు ,మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి, రాజాపూర్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ లో రికార్డులు, కేసుల పురోగతి, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ఆయుధాల భద్రత, సీసీ కెమెరాల పని స్థితి, ఔషధ నిల్వలు, కానిస్టేబుల్ గమనికలు తదితర అంశాలను పక్కాగా పరిశీలించారు. అలాగే పోలీస్ సిబ్బందితో ముఖాముఖీ సమావేశం నిర్వహించి వారి విధి నిర్వహణ, డ్యూటీ నిబద్ధతపై సమీక్ష నిర్వహించారు. స్టేషన్ లో ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందన, మహిళల భద్రత, రాత్రి గస్తీ నిర్వహణ వంటి కీలక అంశాలపై ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. పౌరులకు మరింత మెరుగైన సేవలందించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శివానందం, ఎస్.ఐ ఎస్‌హెచ్‌ఓ మరియు ఇతర పాల్గొన్నారు.

## దుందుభి వాగు నీటి పరిశీలిస్తున్న ఎస్పీ డి.జానకి



వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా( ప్రతినిధి) జులై 23 (జడ్చర్ల ): మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లింగంపేట గ్రామం వద్ద దుందుభి వాగు వద్ద పరిస్థితిని జిల్లా ఎస్పీ డి. జానకి, స్వయంగా పరిశీలించారు. ప్రజలు పొలాలకు వెళ్లే సమయంలో, అవసరాల నిమిత్తం వాగులు దాటే సందర్భాలలో అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో జాగ్రత్తలు పాటించాలి. అవసరం లేకపోతే వాగులు దాటి వెళ్లకూడదు. పిల్లలు, వృద్ధులు, మహిళలు ఇలాంటి ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలి. అధికార యంత్రాంగం పరిస్థితిని పర్యవేక్షిస్తోంది, అని ఎస్పీ పేర్కొన్నారు.అంతరం జడ్చర్ల టౌన్ నందు నేషనల్ హైవే 167 పనులు నడుస్తున్న నేపథ్యంలో, సిగ్నల్ గడ్డ దగ్గర జరుగుతున్న పనులను పరిశీలించిన ఎస్పీ, అక్కడ అనునిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ జామ్ కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్‌ను సరైన మార్గాలపై దారిమళ్లించేలా చర్యలు తీసుకోవాలని జడ్చర్ల టౌన్ పోలీసు అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్ మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## కేజీబీవీ విద్యార్థినుల కు వైద్య పరీక్షలు

(వాయిస్ టుడే ప్రతినిధి) మహబూబ్ నగర్ జిల్లా జులై 23 (జడ్చర్ల) : నవాబు పేట మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం కేజీబీవీ విద్యార్థులకు వైద్య పరీక్షలు ర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో జయరాం నాయక్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది సూచిస్తున్న సలహాలను విద్యార్థినులు పాటించాలని, అదేవిధంగా చదువుపై దృష్టి కేంద్రీకరించాలంటే ఆరోగ్యంగా ఉండడం అవసరమని తెలిపారు. డాక్టర్ తేజశ్రీ విద్యార్థులకు పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత , అంటూ జబ్బులు సీజనల్గా వచ్చే వ్యాధుల గురించి తెలిపారు అవసరమైన వారికి చికిత్స నిర్వహించారు ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ ఓ, మాధవి, వైద్య సిబ్బంది రాములు, బాలమ్మ, విజయ, రాఘవేందర్, శరభ లింగం, శ్రీనివాసులు, ఏఎన్ ఎం శారద , మానస, ఆశా కార్యకర్తలు లక్ష్మి, నిర్మల , సరోజ, పాల్గొన్నారు.



## దివ్యాంగ పిల్లలకు సదుపాయాలు కల్పించాలి

### విద్య శాఖ సెక్రెటరీ యోగితా రాణా

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూలై 23: కొత్తగూడెం లోని భవితా కేంద్రాన్ని సందర్శించి, దివ్యాంగ పిల్లలతో, వారి తల్లిదండ్రులతో ఇంటర్ యాక్ట్ అయిన విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా మాట్లాడుతూ, దివ్యాంగ పిల్లలకు అందవలసిన సదుపాయాలన్నీ పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. ముఖ్యంగా భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల యొక్క కౌశలాలను అభివృద్ధి పరచుకొని, సాధారణ విద్యార్థులతో సమానంగా విద్యను అభ్యసించే విధంగా ఈ భవిత కేంద్రాలు ఎంతగానో దోహదపడు తున్నాయన్నారు. దివ్యాంగ పిల్లలందరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలాస్ , ఉన్నత విద్యాశాఖ కమీషనర్ దేవసేన అసిస్టెంట్ కలెక్టర్ (యు/టి) సౌరబ్ శర్మ, రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్స్ రాజీవ్ , మదన్ మోహన్ , ఆర్జెడి సత్యనారాయణ రెడ్డి , జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకటేశ్వర చారి , జిల్లా కోఆర్డినేటర్ లు నాగరాజ శేఖర్, సైదులు, సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.